ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 19 అక్టోబరు 2024

గర్జించిన ఆకాశం

అనంతలో రాత్రి భారీ వర్షం

హడలెత్తించిన ఉరుములు.. మెరుపులు





శ్రీకంఠం సర్కిల్‌లో వర్షపు నీరు

సోమనాథ్ నగర్‌లో డ్రైనేజీ సమస్య


అనంతపురం అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. మూడు రోజులపాటు వర్షం ప్రశాంతంగానే కురిసినా.. శుక్రవారం రాత్రి అనంతపురంలో ఉరుములు, మెరుపులు భయాన్ని పుట్టించాయి. సుమారు గంటపాటు నలు దిక్కులా దడేల్‌మనే శబ్దాలు, మిరుమిట్లు గొలిపే కాంతులు కొనసాగాయి. భారీ వర్షంతో బస్టాండు, శ్రీకంఠం సర్కిల్ తదితర ప్రాంతాలు మడుగులను తలపించాయి. సోమనాథ్ నగర్, రజక్ నగర్ జలమయమయ్యాయి. ఉరవకొండ, బొమ్మనహాళ్, గుత్తి, శింగనమల, పామిడి, నార్పల మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. శెట్టూరు మండలంలో అత్యధికంగా 59.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. బ్రహ్మసముద్రం 38.2, డి.హీరేహాళ్ 28.6, బొమ్మనహాళ్ 21.6, రాప్తాడు 18.0, కళ్యాణదుర్గం, యల్లనూరు 16.8, వజ్రకరూరు 16.2, గుమ్మఘట్ట 15.6, కంబదూరు 14.0, ఉరవకొండ 13.6, గార్లదిన్నె 11.4, కూడేరు 11.2, కణేకల్లు 10.0, విడపనకల్లు 9.0, శింగనమల 8.4, రాయదుర్గం 7.8, పుట్లూరు 7.0, బెళుగుప్ప 6.8, అనంతపురం 6.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

పెద్ద సార్లే..!



పోతురాజుకాలువ అంగన్‌వాడీ కేంద్రంలో యూట్యూబర్ల దర్జా

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీకి 'అధికారులు' వచ్చారు. శింగనమల మండలంలోని పోతురాజుకాలువ, సి.బండమీదపల్లి, సోదనపల్లి సెంటర్లలో శుక్రవారం రికార్డులు, స్టాక్‌ను తనిఖీ చేశారు. పోతురాజుకాలువ సెంటర్ వద్ద తచ్చాడుతున్న ముగ్గురిని 'ఎవరు మీరు..?' అని అంగన్‌వాడీ కార్యకర్త అడిగితే.. రెవెన్యూ డిపార్ట్‌మెంట్ అని చెప్పారు. 'విధులకు సరిగా రావడం లేదని మీపై ఫిర్యాదులు వచ్చాయి. పిల్లలు ఎందుకు తక్కువగా వచ్చారు..?' అని అంగన్‌వాడీ కార్యకర్తలను హడలుకొట్టారు. తనిఖీలు ముగించుకుని, సీడీపీఓ, సూపర్‌వైజర్ ఫోన్ నంబర్లను తీసుకుని వెళ్లారు. వచ్చింది రెవెన్యూ అధికారులు కాదని, యూట్యూబర్లని ఆ తరువాత గుర్తించారు. కొందరు కొత్త వ్యక్తులు రెవెన్యూ అధికారుల పేరిట అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చింది నిజమేనని సీడీపీఓ ఉమాశంకరమ్మ ధ్రువీకరించారు. తమ సిబ్బందిని బ్లాక్‌మెయిల్ చేసినట్లు తెలిసిందని, అధికారుల పేరు ఐడీ కార్డులు చూపితేగానీ అనుమతించవద్దని సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీకి తాము వెళ్లలేదని రెవెన్యూ అధికారులు చెప్పడం గమనార్హం. ఇటీవల విలేకరులు, అధికారుల పేరు చెప్పి కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని, వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. - శింగనమల, ఆంధ్రజ్యోతి



సగమే ఇచ్చారు..

ఎకరానికి ఒక ప్యాకెట్ పప్పుశనగ విత్తనాలు మాత్రమే ఇచ్చారు. నాకు ఐదు ఎకరాల పొలం ఉంది. మొత్తం పది ప్యాకెట్లు ఇవ్వాల్సి ఉండగా ఐదింటితో సరిపెట్టారు. ఈ విత్తనం సరిపోదు. వ్యవసాయ అధికారులను అడిగినా ఎలాంటి ప్రయోజనం లేదు. ఉన్నతాధికారులు స్పందించి నిబంధనల మేరకు ఎకరానికి రెండు ప్యాకెట్లు ఇవ్వాలి. లేదంటే మార్కెట్‌లో కొనక తప్పదు.

- తిరుమల ప్రసాద్, వెంకటాద్రిపల్లి, బెళుగుప్ప మండలం

యాడికి మండలం నగరూరు వద్ద సిద్ధంగా ఉన్న పొలం

నల్లరేగడి సిద్ధం

తడి ఆరగానే పప్పుశనగ సాగు

- రైతు సేవాకేంద్రాల్లో సగం విత్తనమే..
- నిబంధనలను పాటించని అధికారులు
- మిగిలినవి మార్కెట్‌లో కొంటున్న రైతులు

అనంతపురం అర్బన్/బెళుగుప్ప, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తుఫాను వర్షాలతో నల్లరేగడి నేలలు పదునయ్యాయి. దీంతో పప్పుశనగ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. తడి ఆరగానే విత్తనం వేసేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారు. మరో మూడు రోజులపాటు వర్షం కురవకపోతే విత్తనం వేస్తామని రైతులు అంటున్నారు. ఇప్పటికే పలువురు రైతులు విత్తన పప్పుశనగ కొనుగోలు చేసి ఇళ్లలో సిద్ధంగా ఉంచుకున్నారు. రబీ సాధారణ సాగు విస్తీర్ణం 1.18 లక్షల హెక్టార్లు



కాగా, ఇందులో పప్పుశనగ 72 వేల హెక్టార్లలో సాగవుతుంది. మిగతా విస్తీర్ణంలో జొన్న, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలు వేస్తారు. గత ఏడాది రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 82 వేల హెక్టార్లల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. ఇందులో అత్యధికంగా 49 వేల హెక్టార్లల్లో పప్పుశనగ సాగు చేశారు. ఈ సారి పదును వర్షం పడటంతో సాగు విస్తీర్ణం పెరుగుతుందని భావిస్తున్నారు.

● నిబంధనల అతిక్రమణ

సబ్సిడీ పప్పుశనగ పంపిణీలో పలు మండలాల్లోని అధికారులు నిబంధనలు అతిక్రమిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి అర ఎకరానికి 20 కేజీల విత్తన ప్యాకెట్ ఒకటి ఇవ్వాలి. ఈ లెక్కన అర ఎకరం నుంచి ఎకరం వరకు రెండు ప్యాకెట్లు, ఒకటిన్నర ఎకరాలకు 3 ప్యాకెట్లు.. గరిష్ఠంగా 5 ఎకరాలకు 10 ప్యాకెట్లు పంపిణీ చేయాలి. కానీ బెళుగుప్ప, తాడిపత్రి, యల్లనూరు, ఉరవకొండ తదితర మండలాల్లో ఇవ్వాల్సిన విత్తనంలో సగం మాత్రమే ఇస్తున్నారు. ఎకరానికి ఒక ప్యాకెట్ (20 కేజీలు), ఐదెకరాలకు గరిష్ఠంగా 5 ప్యాకెట్లు (100 కేజీలు) పంపిణీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. రైతులు తప్పని పరిస్థితుల్లో మిగతా విస్తీర్ణానికి మార్కెట్‌లో విత్తనం కొనాల్సి వస్తోంది. యాడికి మండలంలో ప్రతి ఏడాది 2,400 హెక్టార్లకుపై పప్పుశనగ సాగవుతోంది. ఈ సారి రైతు సేవా కేంద్రాల్లో 450 మంది రైతులు 400 క్వింటాళ్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇప్పటి దాకా ఒక్క బస్తా కూడా ఆ మండలానికి పంపలేదు. ఉన్నతాధికారుల స్పందన కోసం రైతులు వేచి చూస్తున్నారు.





మార్కెట్ ధరా అంతే..


జిల్లాకు ఈ ఏడాది 27,139 క్వింటాళ్ల పప్పుశనగ కేటాయించారు. ఇప్పటి దాకా 13,832 మంది రైతులు 19,465 క్వింటాళ్లకుపైగా పప్పుశనగ కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో ఇప్పటి దాకా 17,509 క్వింటాళ్ల విత్తనం పంపిణీ చేశారు. ఈ సారి పప్పుశనగ జేజీ - 11 రకం క్వింటం పూర్తి ధర రూ.9400గా నిర్ణయించారు. ఇందులో 25 శాతం సబ్సిడీ పోనూ రైతు వాటా కింద రూ.7050 చెల్లించాల్సి ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి సబ్సిడీ తగ్గించారు. గతేడాది పప్పుశనగ క్వింటం ధర రూ.8100 ఉన్నింది. ఇందులో 40 శాతం సబ్సిడీ రూ.3,240 పోనూ రైతు వాటా రూ.4860 చెల్లించారు. రెండేళ్ల క్రితం 25 శాతం సబ్సిడీ ఉండేది. గతేడాది సబ్సిడీని 40 శాతానికి పెంచారు. ఈ సారి తిరిగి 25 శాతానికి తగ్గించారు. పప్పుశనగ పూర్తి ధరను గతంతో పోలిస్తే పెంచడంతోపాటు సబ్సిడీని తగ్గించడంతో రైతులపై భారం పడింది. మార్కెట్‌లో క్వింటం విత్తన పప్పుశనగ ధర రూ.7500 పలుకుతోంది. చిన్న, సన్న కారు రైతులకు నిర్దేశించిన మేరకు విత్తనం అందజేస్తే మార్కెట్‌పై ఆధారపడాల్సిన పని లేదు. కానీ సగం మాత్రమే ఇస్తుండటంతో మార్కెట్‌లో కొంటున్నారు. సబ్సిడీ ధరకు మార్కెట్ ధరకు పెద్దగా తేడా లేకపోవడంతో చాలామంది రైతులు మార్కెట్ విత్తనంవైపే మొగ్గు చూపుతున్నారు.

పదును ఆరగానే విత్తనం వేస్తా..

ఈ సారి మంచి వర్షం పడింది. పొలంలో పదును ఆరగానే పప్పుశనగ విత్తనం వేస్తాం. నాకు ఏడు ఎకరాల పొలం ఉంది. నిబంధనల మేరకు ఐదెకరాలకు పది బ్యాగుల విత్తనం ఇవ్వాలి. కానీ నాకు ఐదు బ్యాగులే ఇచ్చారు. ఐదెకరాలలో పంట పెట్టినా.. మరో క్వింటం విత్తనాలు అవసరం అవుతాయి. రైతు సేవా కేంద్రంలో సగమే ఇవ్వడంతో మిగతా విత్తనాలు మార్కెట్‌లో కొన్నాను.



- శ్రీనివాస్‌రెడ్డి, రామసాగరం, బెళుగుప్ప మండలం



సెంట్రల్ సిలబస్.. చిన్న కథ కాదు..!

చదువు ఒత్తిడి భరించలేక మాయమైన విద్యార్థి

అత్తారింటికి ఆటోలో ప్రయాణం.. కథ సుఖాంతం

సినిమాకు తీసుకెళ్లి.. ఊరడించి.. బడికి చేర్చిన తండ్రి

బడికి వెళ్లాల్సిన కొడుకు.. బస్టాండులో మాయమయ్యాడు. ఏమయ్యాడో తెలియక ఆ తండ్రి ఆందోళనకు గురయ్యాడు. స్నేహితులకు, బంధువులకు ఫోన్ చేసి ఆరా తీశాడు. ఉబికి వస్తున్న కన్నీటిని అదిమి పట్టుకుని.. 'నా బిడ్డకు ఏమీ కాకుండా చూడు దేవుడా..' అని మనసులో మొక్కుకుంటూ.. వెతకడం ప్రారంభించాడు. ఆ తరువాత ఏమైంది..? '35.. చిన్న కథ కాదు..' అనే సినిమా చూసే ఉంటారు కదా..? ఇంచుమించు అలాంటి కథే ఇది. అనంతపురం బస్టాండు.. అత్తారిల్లు.. సినిమా థియేటర్.. ఇవన్నీ దాటుకుని కర్నూలులోని ఓ బడి వరకూ సాగిన ఈ యథార్థ సంఘటనలో ఉత్కంఠ, సెంటిమెంట్, ఓర్పు.. నేర్పు.. అన్నీ ఉంటాయి. నేపథ్యం మాత్రం.. కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఎదురయ్యే చదువుల ఒత్తిళ్లు..!

(వివరాలు 7లో)

మాతాశిశు మరణాలు సరికాదు

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు.. వైద్యాధికారులకు కలెక్టర్ హెచ్చరిక



ఆరోగ్యప్రదాయిని పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, వైద్యాధికారులు

అనంతపురం టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిన తరువాత కూడా మాతాశిశు మరణాలు సంభవించడం సరికాదని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. మరణాల విషయంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మాతాశిశు మరణాలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రెండు నెలలు వ్యవధిలో మరణాల గురించి కలెక్టరు ఆరా తీసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు. ఏ శిశువూ పుడుతూ మరణించకూడదని, ప్రసవిస్తూ ఏ మహిళా మరణించకూడదని, ఇది మన ఆశయమని అన్నారు. అయినా జిల్లాలో మాతాశిశు మరణాలు సంభవించడం బాధాకరమని అన్నారు. గర్భిణిగా గుర్తించినప్పటి నుంచి ప్రభుత్వం తరఫున అన్ని పరీక్షలుతో నిర్వహించి, మందులు, పౌష్టికాహారం అందిస్తున్నామని గుర్తు చేశారు. నెలవారీ పరీక్షలలో గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని, అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. ఆ సమయంలో హైరిస్క్ కేసులను గుర్తించి, ప్రత్యేక శ్రద్ధ పెట్టి పర్యవేక్షించాలని చెబుతున్నా ఇంకా నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరణాలు సంభవించినప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లి కారణాలను పక్కాగా తెలుసుకోవాలని సూచించారు. డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే డాక్టర్లకు నిపుణులైన గైనకాలజిస్టులతో శిక్షణ ఇప్పించాలని సూచించారు. ప్రసవాలకు వచ్చినపుడు సాధ్యమైన మేరకు సిజేరియన్ కాకుండా, సాధారణ కాన్పులు జరిగేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆరోగ్య ప్రదాయిని పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్లు షంషాద్‌బేగం, నవీన్ కుమార్, డేవిడ్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు గుటుక్కు..!

నీరున్న ఊరికి దాహం తీర్చారట.. నెలగొండలో వైసీపీ సర్పంచు మాయ

నకిలీ బిల్లులు.. ఫేక్ ఫొటోలతో బురిడీ

ఆర్థిక సంఘం నిధులు రూ.16 లక్షలు స్వాహా



గ్రామంలో వినియోగంలో ఉన్న జీఎల్ఎస్ఆర్ ట్యాంకు

ఆ ఊళ్లో ఐదేళ్ల నుంచి తాగునీటి సమస్యలేదు. రక్షిత మంచినీటి పథకం నుంచి కావాల్సినంత నీరు అందుతోంది. 2019లో తాగునీటి ఎద్దడి ఏర్పడటంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం ట్యాంకర్లతో నీటిని అందించింది. ఆ తరువాత వాటర్ ట్యాంకర్ల అవసరమే పడలేదు. కానీ ట్యాంకర్లతో నీరు తెచ్చి గ్రామస్థుల దాహార్తిని తీర్చినట్లు నకిలీ రికార్డులను సృష్టించి సుమారు రూ.16 లక్షలు మింగేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామ పంచాయతీలలో మౌలిక సదుపాయాల కోసం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. ఇదే అదనుగా నెలగొండలో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా, పారిశుధ్య పరిరక్షణ, తాగునీటి పైపులైన్ల నిర్వహణ పేరిట బిల్లులు సృష్టించి ఎఫ్‌టీసీ నిధులను వైసీపీ సర్పంచు భాగ్యలక్ష్మి పక్కదారి పట్టించారు.

- గుంతకల్లు, ఆంధ్రజ్యోతి

పుష్కలంగా నీరు

నెలగొండలో రక్షిత మంచినీటి పథకానికి మూడు బోర్లు ఉన్నాయి. వాటిద్వారా గ్రామానికి పుష్కలంగా నీరు లభిస్తోంది. బస్టాపు వద్ద గ్రౌండ్ లెవెల్ స్టోరేజ్ (జీఎల్ఎస్ఆర్) ట్యాంకు ఉంది. దానికి చుట్టూ కొళాయిలను బిగించారు. గ్రామస్థులకు ఎప్పుడూ నీరు అందుబాటులో ఉంటుంది. జీఎల్ఎస్ఆర్ వద్ద నుంచి గ్రామస్థుల ఇళ్ల వద్దకు పైప్‌లైన్ ఉంది. దాని ద్వారా ఇళ్లకు నీటి కొళాయిలు ఉన్నాయి. మోటారు ఆన్ చేసిన సమయంలో అందరూ ఇళ్లవద్దే నీరు పట్టుకుంటారు. జీఎల్ఎస్ఆర్ వద్ద పాఠశాలకు ఆనుకుని నీటి శుద్ధి ప్లాంట్ కూడా ఉంది. గ్రామస్థులు బిందె రూ.2 ప్రకారం కొంటుంటారు. నాలుగేళ్లుగా గ్రామంలో ఇదే పరిస్థితి. 2019లో తాగునీటి ఎద్దడి ఏర్పడినప్పుడు ట్యాంకరుతో రోజుకు 11 ట్రిప్పుల నీరు సరఫరా చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ట్యాంకర్ల అవసరం ఏర్పడలేదు. ఊరిలోకి ఒక్క నీటి ట్యాంకరు కూడా రాలేదు. కానీ నీటి సరఫరా, పైప్‌లైన్ల మరమ్మతు, పారిశుధ్యం పేరిట ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.15,92,448 డ్రా చేశారు. జనవరి 29వ తేదీ నుంచి సెప్టెంబరు 17వ తేదీ వరకూ 27 బిల్లులను సృష్టించి.. నిధులను డ్రా చేశారు. వాటర్ సప్లై, శానిటేషన్ కింద రూ.11.23 లక్షలు, పైప్డ్ వాటర్ సప్లై (పీడబ్ల్యూఎస్) మెయింటెనెన్స్ కింద రూ.4.69 లక్షల బిల్లులు తీసుకున్నారు.

నీటి సమస్యే లేదు..



పంచాయతీ ఎన్నికలు జరిగిన తర్వాత మూడేళ్లుగా మా గ్రామంలో తాగునీటి సమస్యే ఏర్పడలేదు. వాటర్ ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయలేదు. ఒక్క ట్యాంకరు కూడా గ్రామంలోకి రాలేదు.

- రామదాసు, నెలగొండ

2019లో మాత్రమే..



మా ఊరిలో 2019 వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడింది. అప్పుడు గ్రామానికి ట్యాంకర్లతో స్పెషల్ ఆఫీసరు ఆధ్వర్యంలో నీటిని సరఫరా చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ గ్రామంలో నీటి సమస్యే ఏర్పడలేదు. -నారాయణ స్వామి, నెలగొండ

నకిలీ బిల్లులు పెట్టుకున్నారు..



గ్రామంలో పనులు చేయకుండానే పంచాయతీలో డబ్బులు డ్రా చేశారు. నకిలీ బిల్లులు, తప్పుడు జీపీఎస్ ఫొటోలతో సర్పంచు భాగ్యలక్ష్మి నిధులు కాజేశారు. అధికారులు వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి.

- శ్రీనివాసులు, నెలగొండ

విచారిస్తాం..



నెలగొండలో జరిగిన అవినీతిపై సమాచారం లేదు. కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అక్కడి నుంచి ఆదేశాలు వస్తే సత్వరమే విచారణ చేపడతాం. త్వరలో ఆ గ్రామానికి ఈఓఆర్డీని పంపి విచారణ జరిపిస్తాను. అక్రమాలు చోటుచేసుకుని ఉంటే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- శ్రీకాంత్ చౌదరి, గుంతకల్లు ఎంపీడీఓ

జీపీఎస్ మాయాజాలం

చేసిన పనులను అప్పటికప్పుడు ప్రభుత్వ యాప్‌లో ఫొటో జియోగ్రాఫికల్ ట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ విషయంలో నకిలీ ఫొటోలు, తప్పుడు సమయాలను నమోదు చేశారు. ఒకే ఫొటోను పలు వర్కులకు వినియోగించారు. జియో ట్యాగ్ అయిన ఫొటోలలో కొన్ని ఏం ఫొటో తీశారో కూడా తెలియనంత అధ్వానంగా బ్లర్ ఇమేజ్‌లను అప్‌లోడ్ చేశారు. దీన్ని బట్టి అక్రమాలలో అధికారులు, సిబ్బంది హస్తం కూడా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఈ అక్రమాలపై కొందరు గ్రామస్థులు ఇటీవల కలెక్టరుకు ఫిర్యాదు చేశారు.





మిట్ట మధ్యాహ్నం తీసిన ఫొటోలకు సాయంత్రం 7 గంటలపైన తీసినట్లుగా చూపిన జియో ట్యాగ్



పురాతన భవనం

నాణ్యతకు నిదర్శనం

వందేళ్లయినా చెదరని భవన నిర్మాణం

ఉరవకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కట్టిన ఐదారేళ్లలోనే కూలిపోతున్న లేదా దిబ్బ తింటున్న ప్రభుత్వ భవనాలు కొన్ని మనకు కనిపిస్తూనే ఉన్నాయి. అయితే వందేళ్లు దాటినా చెక్కు చెదరకుండా నాణ్యమైన నిర్మాణానికి నిదర్శనంగా నిలుస్తోంది ఉరవకొండలోని తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని భవనం. దీన్ని స్వాతంత్ర్యానికి పూర్వం 1910లో నిర్మించారు. గోడలను రాళ్లతో నిర్మించి, పైకప్పు పెంకులతో వేశారు. బ్రిటిష్ వారి పాలనలో నిర్మించిన ఈ భవనాన్ని 2012 వరకూ తహసీల్దారు కార్యాలయంగా వాడుకునేవారు. ప్రస్తుతం ఈ భవనాన్ని వీఆర్వోలు వినియోగిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ఆర్కిటెక్ అధికారులు ఈ భవనాన్ని పరిశీలించారు. 114ఏళ్ల కిందట నిర్మించినప్పటికీ ఈ భవనం పటిష్టంగా ఉందని తెలిపారు. నిస్వార్థంగా కడితే ఏ కట్టడమైనా ఇలాగే పటిష్టంగా ఉంటుందని ఇక్కడికి వచ్చిన వారు పేర్కొంటున్నారు.

పుష్ప విలాపం

- వర్షాలకు దెబ్బతిన్న బంతిపూలు
- తగ్గిన ధరలతో రైతుల దిగాలు

బొమ్మనహాళ్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తున్న వర్షాలతో పూల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని మండలంలో బంతిపూలను విస్తారంగా సాగు చేశారు. దసరా తరవాత ధరలు తగ్గి నష్టాలు వచ్చాయి. మండలంలోని దేవగిరి, దేవగిరి క్రాస్, ఉంతకల్లు తదితర గ్రామాల్లో బంతి పూలు సాగు చేశారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న జడివానకు పూసిన పూలన్నీ కుళ్లిపోతున్నాయి. ఐదు రోజుల కిందట కిలో రూ. 100 పలికిన ధర ప్రస్తుతం కొనేవారు లేక నేల చూపులు చూస్తోంది. దీంతో రైతులు బళ్లారి మార్కెట్టుకు తరలిస్తున్నారు. అక్కడ కిలో రూ.40, రూ.50కు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. కూలీలు, రవాణా ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నారు.



విరబూసిన పూదోట

రోడ్డు ప్రమాదంలో మెడికో మృతి



చైతన్య (ఫైల్)

ఉరవకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపిడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ నర్రాకేశన్న తనయుడు నర్రా చైతన్య(23) బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నర్రా చైతన్య కర్ణాటకలోని శివమొగ్గలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. పీజీ సీటు వివరాల కోసం బెంగళూరుకు వెళ్లాడు. ద్విచక్రవాహనంపై శుక్రవారం ఉదయం వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన చైతన్యను ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో అతడి తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

రేపు విమలాశాంతి పురస్కార సభ

అనంతపురం కల్చరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విమలాశాంతి సాహిత్య సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం కవితా పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీఓ హోంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతినారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లాకు చెందిన లేదాళ్ల రాజేశ్వరరావుకు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. సాహిత్యాభిమానులు హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు.

పొరపాటు పడేరు..!

ఇవి.. భోజనానికి ఏర్పాటు చేసిన ప్లేట్లు కాదు



ఎంఈఓ కార్యాలయంలో వర్షపు నీరు ఫ్లోర్‌మీద పడకుండా ఏర్పాటు చేసిన ప్లేట్లు

కుందుర్పి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఇవేవో అతిథులు భోజనం చేయడానికి ఉంచిన ప్లేట్లు కాదు. వాన నీళ్ల కింద పడకుండా చేసిన ఏర్పాట్లు. వానొస్తే భవనమంతా కారుతుండటంతో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయమంతా తడి కాకుండా ఉండటం కోసం ఇలా ప్లేట్లు, జగ్గులు ఉంచుతున్నారు. మండల విద్యాధికారి, సిబ్బంది వర్షాకాలం వస్తే చాలు ఇలా ఇబ్బంది పడుతూ విధులు నిర్వహించాల్సిన దుస్థితి.

రీ సర్వేతో రికార్డుల్లో భూమి మాయం

రెవెన్యూ సదస్సులో అధికారులకు రైతు ఫిర్యాదు



బాధిత రైతు బసంపల్లి మల్లేష్



రీసర్వే కన్నా ముందు మల్లేష్ పట్టాదారు పాసుపుస్తకం

శెట్టూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రీసర్వే అనంతరం రికార్డులలో తన పేరుమీద ఉన్న భూమి కనిపించడం లేదని మండలంలోని బసంపల్లికి చెందిన రైతు మల్లేష్ పేర్కొన్నాడు. ఈమేరకు శుక్రవారం శెట్టూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టిని కలిసి ఫిర్యాదు చేశాడు. శెట్టూరు రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్ 46లో 52 ఎకరాల విస్తీర్ణం ఉంది. అందులో మల్లేష్‌కు చెందిన 4.28 పొలం రెవెన్యూ రికార్డుల్లో ఉండాలి. కానీ నాలుగు సెంట్లు మాత్రమే రికార్డుల్లో కనబడుతోందని, మిగిలిన 4.24 ఎకరాలు కనిపించడం లేదన్నారు. న్యాయం చేయాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. రీసర్వే అనంతరం తనకు రెవెన్యూ రికార్డులు, 1బి కానీ, అడంగల్ కానీ రావడం లేదన్నారు. దీంతో ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులైన స్పందించి తనకు భూమి రెవెన్యూ రికార్డుల్లో పొందుపరచాలని ఆయన కోరారు.

కల్తీ కేసులో ఆరు నెలల జైలు

పండ్ల వ్యాపారికి శిక్ష... రూ.50 వేలు జరిమానా కూడా


అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): పండ్ల అమ్మకాలలో కల్తీ చేసిన పాపానికి ఓ వ్యాపారి జైలు పాలయ్యాడు. 2015 ఆగస్టు 25న ఫుడ్ సేఫ్టీ అధికారి నాగేశ్వరరావు నగరంలోని మార్కెట్ యార్డులో తనిఖీలు జరిపినట్లు జిల్లా ఆహారభద్రత శాఖాధికారి తస్లీమ్ తెలిపారు. మార్కెట్ యార్డులో బైగారి అశ్వత్థరెడ్డి అనే వ్యక్తి కార్బైడ్‌తో మాగించిన రేగు పండ్లను విక్రయిస్తున్నట్లు గుర్తించారన్నారు. వాటి శాంపిళ్లను రాష్ట్ర ఆహారభద్రత ల్యాబ్‌కు పంపించామన్నారు. పండ్లకు కార్బైడ్ కలిపి అమ్మకాలు జరిపినట్లు నిర్ధారణ అయిందన్నారు. దీంతో నగరంలోని కోర్టులో బైగారి అశ్వత్థరెడ్డిపై కేసు నమోదు చేయించారన్నారు. విచారణ అనంతరం శుక్రవారం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి శివశంకర్ దోషిగా తేలిన అశ్వత్థరెడ్డికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.50వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

ప్రజారోగ్యంతో చెలగాటమాడితే చర్యలు తప్పవ్...

\- ఆహార భద్రత శాఖాధికారి తస్లీమ్

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడాలని చూస్తే కఠిన చర్యలు తప్పవు. ఆహార కల్తీలకు పాల్పడితే బైగారి అశ్వత్థరెడ్డి మాదిరే జైలుపాలు కావాల్సి వస్తుంది. ఆహార పదార్థాలకు సంబంధించి వ్యాపారస్తులు నిబంధనలు పాటించాలి. ఎలాంటి కల్తీలకు తావులేకుండా చూసుకోవాలి. హోటళ్లు తమ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు.. ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి. తనిఖీల సమయంలో ఏవైనా కల్తీలు జరిగినట్లు తెలిస్తే... శాంపిల్స్ రిజల్ట్ అనంతరం కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వ్యాపారస్తులు జాగ్రత్తలు తప్పక పాటించాలి.

ఇసుక, మద్యంలో వేలు పెట్టొద్దు



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

- ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు తెస్తే ఉపేక్షించను
- పనితీరుపై పార్టీవర్గాల సర్వే ఉంటుంది
- ప్రజల్లో విశ్వసనీయత పొందండి
- టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హితబోధ

అనంతపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలను విధ్వంసం చేశారు. ప్రజలు అందుకే ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి. గత వైసీపీ పాలనలోలాగా ఎవరూ ఇసుక, మద్యం వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దు. ఆ విధంగా ఎవరైనా జోక్యం చేసుకుంటే సహించేది లేదు. ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డ పేరు తీసుకొచ్చే విధంగా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించేది లేదు' అని టీడీపీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత పార్టీ ప్రజాప్రతినిధులకు హితబోధ చేశారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో చంద్రబాబునాయుడు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి మినహా ఉమ్మడి జిల్లాకు చెందిన ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కాగా ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ఏ విధంగా నడుచుకోవాలి..? ఏఏ విషయాల్లో జోక్యం చేసుకోకూడదు..? ప్రభుత్వ పనితీరు, ప్రజల సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి ఏ విధంగా తీసుకువెళ్లాలి..? ఎమ్మెల్యేలుగా ప్రజల విశ్వాసాన్ని ఏ విధంగా పొందాలి..? నాయకులు, కార్యకర్తలు, ప్రజలను ఏ విధంగా అనుసంధానం చేసుకొని పార్టీని మరింత బలోపేతం ఎలా చేయాలి..? తదితర అంశాలపై చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

సంకేతాలు వస్తున్నాయ్.. సరిచేసుకోండి

గడిచిన నాలుగు నెలల కాలంలో కొందరు ఎమ్మెల్యేల వ్యవహార శైలి సరిగా లేదన్న సంకేతాలు వచ్చాయ్. వాటిని సరిచేసుకొని ప్రజల్లో విశ్వసనీయత పొందే విధంగా నడుచుకోవాలని హితవు పలికారు. ఎక్కువ శాతం తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలుపొందిన నేపథ్యంలో ఎమ్మెల్యేగా, మంచి రాజకీయ నాయకుడిగా విశ్వసనీయత పొందాలంటే సమయం పడుతుందన్న విషయాన్ని గ్రహించాలన్నారు. అలా కాకుండా ఎమ్మెల్యేగా అయిపోయాం.. ఇక మాకు ఎదురులేదనే విధంగా వ్యవహరిస్తే ఒక్క నిమిషంలోనే విశ్వసనీయతను కోల్పోతారన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని చంద్రబాబు హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వాస్తవాలకు దగ్గరగా నిర్ణయాలు తీసుకుంటున్న నేపథ్యాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి ఎమ్మెల్యేపై ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. అధికారంలోకి వచ్చాం కదా అని వైసీపీ నాయకుల్లాగా వ్యవహరిస్తే ప్రజలు గుర్తుపెట్టుకుంటార న్న విషయాన్ని ప్రతి ఎమ్మెల్యే గ్రహించాలన్నారు. పార్టీ భవిష్యత్‌ను కాపాడే విధంగా ఎమ్మెల్యేలు నడుచుకో వాలన్నారు. ఎమ్మెల్యేలు ప్రజల్లో మరింత గౌరవాన్ని పొందేలా పనిచేయాలని సూచించారు. గత ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు విషయంలో అనేక సర్వేలు చేసిన తర్వాతనే అభ్యర్థులను ప్రకటించామన్నారు. ఎమ్మెల్యేలు గా గెలుపొందిన తర్వాత వారి పనితీరుపైనా పార్టీ నిఘా వర్గాల ద్వారా నిరంతరం సర్వే కొనసాగుతుందన్నారు. ఎక్కడా ఎలాంటి వివాదాంశాల్లోకి తలదూర్చిన, పార్టీ నిఘా వర్గాల ద్వారా తనకు సమాచారం అందుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాని ఎంపీ, ఎమ్మెల్యేలను హెచ్చరించారు.



మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

గడువు పొడిగింపు

అనంతపురం విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు 2024-25 విద్యా ఏడాది గడువు పొడిగించినట్లు డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈనెల 25 వరకూ ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందవచ్చునన్నారు. రూ. 200 అపరాధ రుసుంతో ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకూ అడ్మిషన్లు పొందవచ్చునన్నారు. రూ. 500 అపరాధ రుసుంతో ఈనెల 30,31వ తేదీల్లో అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా జడ్పీ సర్వసభ్యసమావేశం శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక రెండోసారి జడ్పీ సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నారు. తొలి సమావేశానికి కొత్తగా ఎంపికైన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధులు పెద్దగా హాజరు కాలేదు. దీంతో ఈ దఫా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దీనికితోడు మెజార్టీ ప్రభుత్వశాఖల్లో ఉన్నతాధికారుల నుంచి ఎగ్జిక్యూటివ్ లైన్‌లోని ప్రధాన అధికారులంతా చాలా మంది ఇటీవల బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు శాఖల్లో కొత్త అధికారులు వచ్చారు. ఈ ప్రభావం కూడా కొంత సమావేశంపై ఉండే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది. ఈ సారైనా జిల్లాలో నెలకొన్న ప్రధాన సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చ సాగిస్తారో... మమ అనిపిస్తారో చూడాలి.

ఓ పనైపోయింది..!

- కేజీబీవీ ఉద్యోగార్థులకు ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన
- 334 మందిలో 239 మంది హాజరు

అనంతపురం విద్య, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో ఉద్యోగాలకు దరకాస్తు చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ముగిసింది. ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం సర్టిఫికెట్ల స్క్రూటినీ నిర్వహించారు. ఏపీసీ నాగరాజు, డిప్యూటీ డీఈఓ శ్రీదేవి, జీసీడీఓ ఇతర సమగ్రశిక్ష అధికారులు సుమారు 10 బృందాల అధికారుల ఆధ్వర్యంలో అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ఉదయమే ప్రాజెక్టు కార్యాలయానికి అభ్యర్థులు చేరుకున్నారు. చంటిపిల్లలతో హాజరైన తల్లులు కొందరు



చంటి బిడ్డలను లాలిస్తున్న అభ్యర్థుల బంధువులు



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఏపీసీ నాగరాజు తదితరులు

ఇబ్బంది పడ్డారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రావాలని 334మంది అభ్యర్థులకు సమాచారం అందించగా... 239 మంది హాజరైనట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ప్రక్రియ ముగిసిందని, గైర్హాజరైన అభ్యర్థులకుస్క్రూటినీ ఉండదని సమాచారం.

నేడో.. రేపో.. కలెక్టర్ చెంతకు...

సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థుల వివరాలను ప్రాజెక్టు అధికారులు శనివారం క్రోడీకరించే అవకాశం ఉంది. హాజరైన అభ్యర్థులు, వారి అర్హతలు, అనుభవం, రోస్టర్ తదితర వివరాలను క్రోడీకరించి సంబంధిత ఫైల్‌ను శనివారం లేదా ఆదివారం జిల్లా కలెక్టర్‌కు పెట్టనున్నట్లు సమాచారం. కలెక్టర్ నుంచి ఆమోదం లభించగానే... అర్హులను ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారుల నుంచి స్పష్టమవుతోంది.

టీచర్ల సీనియారిటీ జాబితా విడుదల చేయాలి



ఆర్జేడీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను విడుదల చేయాలని ఎస్టీయూ నాయకులు ఆర్‌జేడీ శామ్యూల్‌ను కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆర్‌జేడీని కలిశారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ టీచర్ల సీనియారిటీ జాబితాను, జిల్లా పరిషత్, ప్రభుత్వ యాజమాన్య టీచర్ల రెగ్యులరైజేషన్, సీనియారిటీ జాబితాలను అన్ని డీఎస్సీల టీచర్లకు తయారు చేయాలని ఆర్‌జేడీకి వినతిపత్రం అందించారు.

ఆర్‌జేడీని కలిసిన ప్రైవేట్ స్కూల్‌యూనియన్ నేతలు

కడప ఆర్‌జేడీ శామ్యూల్‌ను అనంతపురం ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి రమణారెడ్డి, సీఆర్వో రవిచంద్రారెడ్డి, నగర ప్రధానకార్యదర్శి విజయ్‌కుమార్ ఇతర నాయకులు ఆర్‌జేడీని కలిసినవారిలో ఉన్నారు.

రేపు అంకురం వేడుకలు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): త్యాగరాజ సంగీత సభ ఆధ్వర్యంలో ఆదివారం అంకురం శాస్త్రీయ సంగీత నృత్య వేడుకలు నిర్వహించనున్నట్లు సంగీతసభ అధ్యక్షుడు ఎన్‌సీ సంపత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేరళకు చెందిన అలా వేణుగోపాల్‌తో పాటు వివిధ ప్రాంతాల కళాకారులచే ఆదివారం సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు శాస్త్రీయ, సంగీత నృత్య వేడుకలు నిర్వహిస్తామన్నారు. కళాకారులు, కళాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ సమైక్యత శిబిరానికి మెడికోలు



మెడికోలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు

అనంతపురం టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యత శిబిరానికి అనంతపురం మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు శుక్రవారం తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జానకి, దివ్యతేజ్, దివ్య షెకావత్ ఈ నెల 21 నుంచి 27 వరకు హరియాణాలోని ఇందిరాగాంధీ యూనివర్సిటీలో జరిగే శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. కేంద్ర యువజన సర్వీసుల క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య యూనివర్శిటీ తరఫున అనంత మెడికోలు ఎంపికైనట్లు తెలియజేశారు. మెడికోలను ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ పరదేశీనాయుడు అభినందించారు.

డీఎడ్ కళాశాల అక్రమాలపై విచారణ



విచారణ చేస్తున్న ఆర్‌జేడీ కార్యాలయ సిబ్బంది

అనంతపురం విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బుక్కరాయ సముద్రంలోని విజయభారతి డీఎడ్ కళాశాలలో జరిగిన అక్రమాలపై ఆర్‌జేడీ కార్యాలయ అధికారులు విచారణ చేశారు. పాత డీఈఓ ఆఫీస్‌లో ఆర్‌జేడీ శామ్యూల్, ఏడీ అరుణ్, ఏసీ గోవింద్‌నాయక్‌తో కలిసి డైట్ కళాశాల సిబ్బందిని శుక్రవారం విచారించారు. కళాశాల యాజమాన్యం మారిన నేపథ్యంలో నూతన యాజమా న్యం విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో కలెక్టర్, ఆర్‌జేడీ, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో విచారణకు ఆదేశించారు. విద్యార్థులను కూడా పిలిపించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

పని ఒకటి... బిల్లు మరొకటి

- ఇంటిపేరుతో బిల్లు పెట్టి.. అద్దె భవనం రీమోడలింగ్
- జగనన్న ఇళ్ల నిర్మాణంలో అంతులేని అవినీతి
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

విడపనకల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జగనన్న ఇళ్ల నిర్మాణంలో అంతులేని అవినీతి జరిగింది. మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణం చేయకపోయిన వైసీపీ నాయకులు చెప్పిన వారికి హౌసింగ్ అధికారులు బిల్లులు మంజూరు చేశారు. మండల కేంద్రంలో ఉన్న కెనరా బ్యాంక్‌ను వైసీపీ పాలనలో రీ మోడలింగ్ చేయించారు. దానికి పెట్టిన ఖర్చంతా ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న ఇంటి బిల్లులే అని తేలింది. వలిపిరెడ్డి గారి లక్ష్మీ నరసమ్మ ఇంటి ఐడీ నంబరు: 120310ఎన్‌పీఐ1165442, వలిపిరెడ్డి లావణ్య రెడ్డి ఇంటి ఐడీ నంబరు: 120310ఎన్‌పీఐ1328252 కుటుంబ సభ్యుల పేర్లమీద రెండు జగనన్న బిల్లులు మంజూరు చేశారు. వీరికి సంబంధించిన ఓ ఇంటిని కెనరా బ్యాంక్‌కు అద్దెకు ఇచ్చారు. దాన్ని రెండు జగనన్న ఇంటి బిల్లులు మంజూరు చేయించుకుని రీ మోడలింగ్ చేయించారు. వీరికి బ్యాంకు వారు నెలకు రూ.40వేలు అద్దె ఇస్తున్నారు. రీమోడలింగ్ అనంతరం అద్దె రూ. 50వేలు పైనే చెల్లిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై గతంలో దండోర జిల్లా కార్యదర్శి కెంగూరి ఎర్రిస్వామి తహసీల్దారు ఈరమ్మకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారుల్లో చలనం లేదు.



రూఫ్‌లెవెల్ కనిపిస్తున్న పేర్లు



కంప్లీట్ లిస్టులో పేర్లను కనిపించకుండా చేసిన అధికారులు

వ్యాపార సముదాయాలకు సైతం..

హౌసింగ్ అధికారులు మండల కేంద్రంలో వ్యాపార సముదాయాలకు సైతం జగనన్న ఇంటి బిల్లులు మంజూరు చేశారు. పాత మిద్దెలకు బిల్లులు మంజూరు చేశారు. మండల కేంద్రంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్, హౌసింగ్ ఏఈలు వైసీపీ నాయకులతో కుమ్మక్కై మామూళ్లు తీసుకుని రూ.లక్షల బిల్లులు మంజూరు చేశారు. ఒక్కో ఇంటికి రెండు మూడు బిల్లులు మంజూరు చేశారు. కెనరా బ్యాంక్‌కు దాదాపుగా రూ. 4లక్షలు పూర్తి బిల్లును ఇచ్చారు. ఇద్దరి పేర్లను హౌసింగ్ అధికారులు ఆర్‌ఎల్ (రూఫ్‌లెవెల్)లో బిల్లులు పెట్టేందుకు రికార్డులలో చూపించారు. కానీ పూర్తి బిల్లు(కంప్లీట్)పెట్టె సమయానికి ఇబ్బందులు వస్తాయని తెలివిగా లిస్టులో నుంచి పేర్లను తొలగించారు. ఎవరు సమాచారం అడిగినా కంప్లీట్ లిస్టులో వీరి పేర్లు లేని జాబితా మాత్రమే బయటకు ఇస్తున్నారు. ఆర్‌ఎల్‌లో ఉండే ఇళ్లు కంప్లీట్‌లోకి వచ్చేసరికి మాయం అయిపోయాయి. హౌసింగ్ అధికారులు మామూళ్లు ఇచ్చిన వారికి, అప్పటి వైసీపీ నేతలు చెప్పిన వారికి ఏమాత్రం వెనుకాడకుండా బిల్లులు మంజూరు చేశారు. మండలంలోని జగనన్న ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపి, ప్రభుత్వ నిధులను రికవరీ చేయాలని జిల్లా అధికారులు, మండల అధికారులకు ఇదివరకే మండల ప్రజలు, దండోర నాయకులు ఫిర్యాదు చేశారు.

ఈ విషయమై హౌసింగ్ అధికారులను వివరణ కోరగా వలిపి రెడ్డి లక్ష్మీనరసమ్మ, వలిపి రెడ్డి లావణ్య రెడ్డికి సంబంధించి రెండు ఇళ్లకు బిల్లులు పూర్తిగా మంజూరు చేశామన్నారు. రెండు బిల్లులు పెట్టిన మాట వాస్తవమే కానీ తాము ఇళ్ల నిర్మాణానికి మాత్రమే బిల్లులు మంజూరు చేశామన్నారు.



జగనన్న ఇంటి బిల్లుతో రీమోడలింగ్ చేసిన కెనరా బ్యాంక్

చాకలి శ్రీనివాస్ దొరికాడా..?

హిందూపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సంచలనం రేకెత్తించిన అత్తాకోడలిపై సామూహిక అత్యాచారం కేసులో కీలక నిందితుడు చాకలి శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. చిలమత్తూరు మండలంలో నిర్మాణంలో ఉన్న పరిశ్రమ వద్ద వాచ్‌మన్ కుటుంబంలోని అత్తాకోడలిపై ఈనెల 11 అర్ధరాత్రి దాటాక ఆరుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ కేసులో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్, అంతర్రాష్ట్ర దొంగ ఎరుకుల నాగేంద్రతోపాటు మరో పాత నేరస్థుడు సాకే ప్రవీణ్‌కుమార్, ముగ్గురు మైనర్లను ఈనెల 15న పోలీసులు అరెస్టు చేశారు. అత్యాచారాల్లో ఆరితేరిన కీలక నిందితుడు చాకలి శ్రీనివాస్ పరారీలో ఉన్నాడు. ఇతడిని పట్టుకునేందుకు జిల్లా ఎస్పీ మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని పట్టణాల్లో ఇతడి కోసం నిఘావేశారు. ఈ తరుణంలో గురువారం సాయంత్రం మడకశిరలో ఉన్నాడన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అతడిని అదుపులోకి తీసుకుని, అక్కడి నుంచి రహస్య ప్రదేశానికి తీసుకెళ్లి విచారిస్తున్నట్లు తెలిసింది. పట్టుబడిన ఐదుగురు నిందితులు అత్యాచారాలతోపాటు గతంలో వారు చేసిన నేరాలను వివరించారు. కీలక నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో ఇతడి ద్వారా ఏయే నేరాలు వెలుగులోకి వస్తాయోనన్న చర్చ పోలీసు వర్గాల్లో సాగుతోంది.

మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయండి

నారా లోకేశ్‌కు మంత్రి సత్యకుమార్ వినతి

ధర్మవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారికతపై గట్టిసందేశం పంపేవిధంగా రాయలసీమలో మహిళలకు ప్రత్యేక ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటుచేసే విషయాన్ని పరిశీలించామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు లేఖ పంపారు. ఆ లేఖను మంత్రి మీడియాకు విడుదల చేశారు. జనాభాలో సగం ఉన్న మహిళలకు స్థిరమైన అభివృద్ధి అవకాశాలు కల్పించే అంశంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని లేఖలో అభిప్రాయపడ్డారు. రాయలసీమ సామాజిక, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, తగిన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఇదేనని మంత్రి లేఖలో స్పష్టం చేశారు. ధర్మవరంలో ప్రత్యేకంగా మహిళల కోసం ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు అనంతపురం జేఎన్టీయూ ప్రతిపాదించిందని మంత్రి సత్యకుమార్ లేఖలో ప్రస్తావించారు.

స్వర్ణకారుల సంబరాలు



ధర్మవరంలో సంబరాలు చేసుకుంటున్న స్వర్ణకారులు

ధర్మవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్వర్ణకారుల ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడంతో ధర్మవరంలో స్వర్ణకారులు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం అంజుమన్ సర్కిల్‌లో స్వర్ణకారులు కేక్‌కట్ చేసి, ఆనందం పంచుకున్నారు. అనంతరం స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు ఖలీల్ మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే దానిని నెరవేర్చారన్నారు. ఇది స్వర్ణకారులకు సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో స్వర్ణకారులు కేహెచ్ ప్రకాశ్, షామీర్, షబ్బీర్, గోవిందరాజులు, అనిల్, సతీశ్ పాల్గొన్నారు.

మహా సమాధిని దర్శించుకున్న కేంద్రమంత్రి



సత్యసాయి మహాసమాధికి నమస్కరిస్తున్న కేంద్రమంత్రి మురుగన్

పుట్టపర్తి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): కేంద్ర సమాచార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి మురగన్ శుక్రవారం రాత్రి పట్టణంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి బెంగళూరు నుంచి రోడ్డుమార్గాన సాయంత్రం 5.30 గంటలకు ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. కేంద్రమంత్రికి జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, తహసీల్దార్ రంగనాయకులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, స్వాగతం పలికారు. శాంతిభవనంలో విశ్రాంతి తీసుకుని 6.30 గంటలకు సాయికుల్వంత్ సభామండపానికి వెళ్లారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం రాత్రి 7 గంటలకు రోడ్డుమార్గాన ప్రత్యేక కాన్వాయ్‌లో బెంగళూరుకు తిరిగి వెళ్లారు.

రేపు ఆప్టా రాష్ట్ర స్థాయి కౌన్సిల్ సమావేశం

అనంతపురం విద్య, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(ఆప్టా) రెండో రాష్ట్రస్థాయి కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి వెంకటరత్నం శుక్ర వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని ఉపాధ్యాయభవన్‌లో సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఇతర జిల్లాల అధ్యక్షులు, పలువురు నాయకులు హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని నాయకులు అందరూ హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఆలయం ధ్వంసం

గుప్తనిధుల వేటగాళ్ల అకృత్యం



ధ్వంసమైన అపరాదయ్యస్వామి గుడి

బత్తలపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):గుప్తనిధుల వేటగాళ్లు బరితెగించారు. మండలంలోని అప్రాచెరువు గ్రామ సమీపానగల అపరాదయ్య స్వామి ఆలయాన్ని గురువారం రాత్రి పూర్తిగా ధ్వంసం చేశారు. తరాలుగా అపరాదయ్యస్వామి గుడి ఉంది. గుర్తుతెలియని దుండగులు ఎక్స్‌వేటర్‌తో తొలగించారు. శుక్రవారం ఉదయం అటుగా వెళ్తున్న వారు గమనించి, గ్రామస్థులకు తెలిపారు. గ్రామస్థులు అక్కడికి చేరుకుని, ఆలయాన్ని తొలగించడం దారుణమని ఆవేదన చెందారు.



మార్కెట్ సౌకర్యం కల్పించాలి

సీతాఫలాలకు మంచి డిమాండ్ ఉంటుంది. వాటిని ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి, విక్రయించాల్సి వస్తోంది. స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పిస్తే రవాణా ఖర్చులు ఆదా అవుతాయి. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- భీమప్ప, కూలీ, రొప్పం



ఈ పండు వెరీ స్పెషల్..



సీతాఫలానికి ఎన్నెన్నో ప్రత్యేకతలు

ఈ సీజన్‌లో మాత్రమే దొరికే మధురఫలం

ఎందరో పేదలకు ఉపాధి



సీతాఫలాలను విక్రయిస్తున్న కూలీలు

మడకశిర రూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): సీతాఫలం అంటే ఎంతో ప్రత్యేకం. కొండప్రాంతాల్లో పండే అరుదైన ఫలం. వర్షాకాలంలో మాత్రమే పండుతుంది. ఔషధ గుణాలు అధికం. రసాయన మందులేవీ వాడరు కాబట్టి ఎలాంటి సంకోచం లేకుండా ఆరగించవచ్చు. అంతేకాదు, ఎందరో కూలీలకు ఉపాధి కూడా చూపుతుంది. మడకశిర ప్రాంతంలో కొండలు, గుట్టలు అధికంగా ఉన్నాయి. వాటిలో సీతాఫలాలు పండుతాయి. దీంతో ఈ ప్రాంతం సీతాఫలాలకు ప్రసిద్ధి. మండలంలోని ఏఆర్ రొప్పం, ఎగువ రామగిరి, దిగువ రామగిరి, హెచ్‌ఆర్ పాళ్యం, గౌరిపురం గుండుమల, కదిరేపల్లి, గుర్రపుకొండ, ఉగ్రేపల్లి, బూదిలి, కేకాతి గ్రామాల నుంచి అధికంగా సీతాఫలాలు వస్తున్నాయి. ఆయా గ్రామాల కూలీలు సెప్టెంబరు నుంచి మూడు నెలలపాటు సీతాఫలాల ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఆయాగ్రామాల కూలీలు, రైతులు రోజూ వేకువజామునే గ్రామ సమీపంలోని కొండలు, గుట్టల్లోకి వెళ్లి చెట్ల నుంచి సీతాఫలాలను కోసుకొస్తారు. వాటిని మడకశిరలో విక్రయిస్తుంటారు. మరికొంతమంది వాటిని పావగడకు తీసుకెళ్తారు. దాదాపు 250 కుటుంబాలు సీతాఫలాల నుంచి ఉపాధి పొందుతున్నాయి. సీతాఫలాల్లో ఔషధ గుణాలు అధికం. వాటికి మార్కెట్‌లో డిమాండ్ కూడా ఎక్కువే. బెంగళూరు, తుమకూరు తదితర నగరాల నుంచి వచ్చి సీతాఫలాలను కొనుగోలు చేస్తున్నారు.



రైతులను ప్రోత్సహించాలి

నాకున్న పొలంలో 50 సీతాఫలం చెట్లున్నాయి. మంచి దిగుబడి వస్తోంది. వాటికితోడు కొండగుట్టల్లో కాయలు కోసుకొచ్చి, పట్టణానికి తీసుకెళ్లి, విక్రయిస్తున్నా. ఖర్చులుపోను కొంత ఆదాయం వస్తోంది. సంబంధిత అధికారులు.. సీతాఫలం సాగుపై రైతులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించాలి.

-కిష్టప్ప, రైతు, బూదిపల్లి

సెంట్రల్ సిలబస్.. చిన్న కథ కాదు..!

చదువు ఒత్తిడి భరించలేక

మాయమైన విద్యార్థి

అత్తారింటికి ఆటోలో ప్రయాణం..

కథ సుఖాంతం

సినిమాకు తీసుకెళ్లి.. ఊరడించి..

బడికి చేర్చిన తండ్రి


అనంతపురం క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ఒకప్పుడు ఫ్యాక్షన్ కోసం ఎంతకైనా తెగించేవారు. ఇప్పుడు బిడ్డల చదువుల కోసం అంతకు మించి చేస్తున్నారు. మరీ ముఖ్యంగా.. పల్లెటూరి తల్లిదండ్రులు చెమటను కరెన్సీ మూటలుగా మార్చి కార్పొరేటు విద్యాసంస్థలకు కట్టబెడుతున్నారు. తమలాగా పిల్లలు కష్టాలు పడకూడదన్న తాపత్రయం వారిది. ఈ ఆలోచనతో ఇంటికి, ఊరికి దూరంగా.. నగరాలకు తీసుకువెళ్లి హాస్టళ్లలో వదులుతున్నారు. అక్కడ పసివారు పడే ఇబ్బందుల గురించి పెద్దగా ఆలోచించడం లేదు. 'వెళ్లను నాన్నా.. ఇంటి వద్దే ఉండి చదువుకుంటా..' అని కన్నబిడ్డలు కంట తడి పెడితే.. కన్నవారు కన్నీళ్లను దాచుకుని ఊరడిస్తుంటారు. 'బాగా చదువుకో.. భవిష్యత్తు బాగుంటుంది. నీ కోసమే కదా ఇదంతా..?' అని నచ్చజెప్పి వస్తుంటారు. కాదూ కూడదు అంటే.. కొందరు మొరటుగా రెండు దెబ్బలు వేస్తుంటారు. గట్టిగా మందలిస్తుంటారు.

అనంతపురం నగరానికి సమీపంలో ఉన్న ఓ పల్లెటూరు వారిది. కొడుకును బాగా చదివించాలని నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి వరకు చదివించాడు. మరింత బాగా చదివించాలని గత ఏడాది 8వ తరగతికి కర్నూలులోని ఓ ప్రముఖ పాఠశాలలో చేర్పించాడు. ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్న ఆ పిల్లవాడు దసరా పండుగకు ఇంటికొచ్చాడు. సెలవులు పూర్తి కావడంతో కొడుకును తిరిగి బడికి పంపేందుకు తండ్రి బైక్‌పై ఎక్కించుకుని శుక్రవారం అనంతపురం బస్టాండుకు వచ్చాడు. బస్సు ఇంకా రాకపోవడంతో 'వెళ్లి టిఫిన్ చేసి.. వచ్చేటప్పుడు వాటర్ బాటిల్, న్యూస్ పేపర్ తీసుకురా..' అని కొడుకును పంపించాడు తండ్రి. టిఫిన్‌కు వెళ్లిన కొడుకు అరగంట దాటినా తిరిగి రాకపోవడంతో తండ్రి కంగారుపడ్డాడు. స్నేహితులకు విషయం చెప్పి పలు ప్రాంతాల్లో గాలించాడు. అనంతపురంలో ఉంటున్న తన సోదరికి విషయం తెలియజేశాడు. ఆమె తన అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ భార్యకు సమాచారం ఇచ్చింది. 'మా అల్లుడు వస్తే నాకు చెప్పు. నేను వెతికేందుకు వెళతా..' అని చెప్పింది. ఈ లోగా అల్లుడు ఆటోలో నేరుగా తన అత్త ఉంటున్న అపార్ట్‌మెంట్ వద్ద దిగి.. అక్కడే తచ్చాడటం ప్రారంభించాడు. వాచ్‌మెన్ భార్య గమనించి.. 'మీ అల్లుడొచ్చాడు..' అని అత్తకు చెప్పింది. దీంతో వెంటనే అత్త ఆత్రంగా వచ్చి అల్లుడిని ఇంట్లోకి తీసుకెళ్లింది. సోదరుడికి సమాచారం ఇచ్చింది. అప్పటిదాకా కొడుకు ఏమయ్యాడో అని అల్లాడిపోయిన తండ్రి.. ఊపిరి పీల్చుకున్నాడు.

విషయం ఏమిటంటే..


సోదరి ఇంటికి చేరుకున్న విద్యార్థి తండ్రి.. 'ఏమైంది నాన్నా..?' అని అడిగాడు. ఇలా చెప్పాపెట్టకుండా మాయమైపోతే తన పరిస్థితి ఏమిటని ఆరా తీశాడు. అప్పుడు అసలు విషయం చెప్పాడు ఆ విద్యార్థి. 'ఎనిమిదో తరగతి వరకు స్టేట్ సిలబస్ చెప్పారు. ఇప్పుడు సెంట్రల్ సిలబస్ చెబుతున్నారు. ఇబ్బందిగా ఉంది..' అని బాధగా ముఖం పెట్టాడు. తండ్రికి విషయం అర్థమైంది. ఆవేశపడి కొడుకును తిట్టలేదు.. కొట్టలేదు. 'అదేం పెద్ద విషయం కాదులే.. నాతో చెబితే నేను చూసుకునేటోన్ని కదా..? బడిలో మాట్లాడేవాన్ని కదా..?' అని కొడుక్కు నచ్చజెప్పాడు. ఆ తరువాత సినిమాకు తీసుకెళ్లాడు. సినిమా చూసే క్రమంలో.. 'నువ్వు ఎలాగైనా చదువు. ఫస్ట్ రావాలని, సెకండ్ రావాలని లేదు. ప్రశాంతంగా చదువుకో.. పదో తరగతి పాసవ్వు చాలు. ఎలాంటి టెన్షన్ పడొద్దు..' అని అనునయించాడు. సినిమా అయిపోయాక.. 'ఇక బడికి వెళదామా..?' అని కొడుకును అడిగాడు తండ్రి. 'సరే.. పోదాం పద నాన్నా..' అన్నాడు ముద్దుల కొడుకు. బస్సు ఎక్కి.. సాయంత్రానికి ఇద్దరూ కర్నూలుకు చేరుకున్నారు. కొడుకును బడిలో దించి.. వెనుదిరిగాడు తండ్రి..!

జలపాత హొయలు..



జాలువారుతున్న బత్రేపల్లి జలపాతం

కదిరి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎడతెరపిలేని వర్షాలకు తలుపుల మండలంలోని బత్రేపల్లి జలపాతం జలకళను సంతరించుకుంది. కొండలపై నుంచి శుక్రవారం వర్షపునీరు జాలువారుతూ కనువిందు చేస్తోంది. జలపాతాన్ని చూడడానికి ఉదయం నుంచి కదిరి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఇటీవలే అటవీశాఖ ఈ ప్రాంత సుందరీకరణ పనులు చేపట్టింది. అవి పూర్తయితే మరింతమంది పర్యాటకులు ఈప్రాంతాన్ని సందర్శించే అవకాశం ఉంటుంది.



పర్యాటకుల సందడి


మత్తుపై గట్టి నిఘా వేయండి: కలెక్టర్



డ్రగ్స్ నియంత్రణ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్

అనంతపురం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు జిల్లాకు రవాణా కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో డ్రగ్స్ నియంత్రణపై జిల్లా స్థాయి నార్కోటిక్స్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. డ్రగ్స్ నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో పోలీసులు, రైల్వే అధికారులు ప్రత్యేక నిఘా వేయాలని సూచించారు. పాఠశాలల సహా అన్ని విద్యా సంస్థలు, జేఎన్‌టీయూ, ఎస్కేయూపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అన్నారు. మత్తు వల్ల కలిగే అనర్థాల గురించి యువత, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. బస్టాండ్‌లలో పార్శిల్స్‌ను ఆర్టీసీ అధికారులు పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. జిల్లా సర్వజన వైద్యశాలలో అన్ని వసతులతో వారంలోపు డి-అడిక్షన్ వార్డును ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు ఆదేశించారు. మత్తు పదార్థాల విషయంలో ఎక్కడా రాజీ పడబోమని ఎస్పీ జగదీష్ అన్నారు. రవాణా చేసేవారిని చట్టపరంగా శిక్షిస్తామని, జిల్లా నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో విద్యాలయాలు, గ్రామాలలో మత్తు పదార్థాలతో కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. మత్తు పదార్థాల రవాణా విషయంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, గుంతకల్లు రైల్వే డివిజన్ డీఎస్పీ హర్షిత, డీటీసీ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.40



అనంతపురంరూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 1500 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.26, కనిష్ఠ ధర రూ.17పలికినట్లు ఆయన తెలిపారు.

జీడిపల్లికి 1026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం 1026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 962 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.667 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు వెల్లడించారు.

బడిలో భయం.. భయం..



ఊడిపడిన వరండా పైకప్పు పెచ్చులు



పెచ్చులూడిన వరండా పైకప్పు

శిథిలావస్థకు చేరిన భవనం



మడకశిర మండలంలోని జమ్మానిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు భయంభయంగా ఉండాల్సి వస్తోంది. పాఠశాలలో 25 మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. రెండు భవనాలున్నాయి. ఒక భవనంలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. పక్కనే ఉన్న మరో భవనం శిథిలావస్థకు చేరుకుంది. విద్యార్థులు విశ్రాంతి సమయం, సెలవు రోజుల్లో ఆ భవనంలోకి వెళ్లి ఆడుకుంటుంటారు. శిథిలావస్థకు చేరుకున్న భవనం పైకప్పు పెచ్చులు ఊడుతుండడంతో ఎప్పుడు, ఏం జరుగుతుందోనని తల్లి దండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వెంటనే భవనాన్ని తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.

-మడకశిర రూరల్(ఆంధ్రజ్యోతి)

భక్తిశ్రద్ధలతో కలశ పూజలు



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : శారదా నగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులు నదీజలాలను కలశాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి, ఆలయ ఆవరణలో కలశపూజలు నిర్వహించారు. అనంతరం నవగ్రహాల తో పాటు శివబాలయోగి మహరాజు, అనంతేశ్వరస్వామి, అనంతేశ్వరిమాత, వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూలవిరాట్లకు ఆ నీటి అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజ్, ప్రసాద్, గాధంశెట్టి విశ్వనాథ, లక్ష్మీనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులపై డీఎస్పీ విచారణ



యర్రగుంట్లలో విచారణ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

గార్లదిన్నె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండల పరిధిలోని యర్రగుంట్ల, ఇల్లూరు గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ కేసులపై శుక్రవారం సాయంత్రం ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషాతో కలసి విచారించారు. అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామస్థులతో డీఎస్పీ మాట్లాడారు. గ్రామాల్లో అందరు కలసిమెలసి ఉండాలన్నారు. చిన్న చిన్న సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అలా కాకుండా అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ముఖ్యంగా గ్రామాల్లో ఎక్కడైనా మట్కా, పేకాట తదితర జూదాలు నిర్వహిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

టపాసులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

● తహసీల్దార్ పుణ్యవతి

బుక్కరాయసముద్రం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా మండల కేంద్రంలో టపాసుల విక్రయదారులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ పుణ్యవతి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం టపాసు విక్రయాల నిబంధనలపై పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పణ్యవతి , సీఐ కరణాకర్ టపాసుల విక్రయదారులకు నిబంధనలు వివరించారు. అనంతరం టపాసుల విక్రయించే స్థలాన్ని పరిశీలించారు.

అనుమతిలేని చోట విత్తనాలు కొనవద్దు

● వేరుశనగ గోడౌన్లను తనిఖీ చేసిన ఏఓ

గార్లదిన్నె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అనుమతి లేని చోట వేరుశనగ విత్తనాలు కొనుగోలు చేయకండని రైతులకు వ్యవసాయ అధికారి సోమశేఖర్ సూచించారు. మండలంలోని కల్లూరు గ్రామంలో అనుమతి లేకుండా వేరుశనగ విత్తనాలను రైతులకు విక్రయిస్తున్నారన్న సమాచారంతో శుక్రవారం సాయంత్రం వ్యవసాయాధి ఆ గోడౌన్లను తనిఖీ చేశారు. గోడౌన్లలో వేరుశనగ విత్తనాలు విక్రయిస్తున్న వారికి ఎవరికి ఎలాంటి లైసెన్స్‌లు లేవని గుర్తించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రైతులకు వేరుశనగ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. ముఖ్యంగా రైతులు అనుమతులు లేని వారి వద్ద నుంచి విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచించారు.

విద్యుదాఘాతంతో మున్సిపల్ కార్మికుడికి గాయాలు

అనంతపురం క్రైం, అక్టోబరు 18 : నగరపాలిక పరిధిలోని ఇంజనీరింగ్ విభాగం వాటర్ వర్క్స్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుడు గౌరి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అతడు శుక్రవారం విధులలో భాగంగా కమలానగర్‌లో వాటర్ లీకేజీ పనులు చేస్తుండగా విద్యుదఘాతానికి గురయ్యాడు. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో పాటు శరీర భాగం కాలిపోయింది. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న గౌరిని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణ, జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు తదితరులు పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన కార్మికుడికి కమిషనర్, అధికారులే పూర్తి వైద్యం చేయించాలని డిమాండ్ చేశారు. నగర మేయర్ మహమ్మద్ వసీం చికిత్స పొందుతున్న గౌరిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, కార్పొరేటర్ సైఫుల్లా బేగ్, శీనా తదితరులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న మహిళ మెడలో గొలుసు అపహరణ

రాప్తాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం రాత్రి నిద్రిస్తున్న మహిళ మోకే సావిత్రమ్మ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. రాప్తాడుకు చెందిన మోకే నాగేంద్ర, సావిత్రమ్మ దంపతులు ఇంటి పైనున్న గదిలో, వారి కుమారుడు అరుణ్‌కుమార్ కింద ఇంట్లో పడుకున్నారు. వర్షం పడటం, రాత్రి సమయం కావడంతో పై ఇంట్లో పడుకున్నవారు తలుపులు వేసుకోలేదు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి కింద ఇంటి తలుపునకు బయట గడియ పెట్టి పైకి వెళ్లి నిద్రిస్తున్న మోకే సావిత్రమ్మ మెడలోని బంగారు గొలుసు లాగాడు. సావిత్రమ్మకు మెలకువ వచ్చి గట్టిగా అరవడంతో సగం గొలుసు దొంగ చేతికి దొరకడంతో పరారయ్యా డు. మిగతా సగం ఆమె దగ్గరే పడిపోయింది. చుట్టు పక్కల వాళ్లు రావడంతో దొంగ పరిసరాల్లో లేకుండా పోయాడు. బాధితులు రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గార్లదిన్నె, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి తండాకు చెందిన పల్లవీబాయి (25) అనే మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వెంకటాంపల్లి తండాకు చెందిన పల్లవీబాయి బంధువు శంకర్‌నాయక్‌తో కలసి ఐదురోజుల క్రితం శింగనమల మండలం నాగులగుడ్డం తండాలో బంధువుల ఇంటికి దిచక్ర వాహనంలో వస్తోంది. పెనకచెర్ల డ్యాం వద్ద దిచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఆమెను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాన.. వరద..





జనశక్తి నగర్‌లో జలమయమైన వీధులు, ఇళ్లలోకి చేరిన నీరు

జనశక్తి నగర్, ఎంజీఎం కాలనీలో ఇళ్లలోకి నీరు

సోమనాథ్ నగర్, రజక నగర్ వీధులు జలమయం

మడుగును తలపించిన ఆర్టీసీ బస్టాండు, శ్రీకంఠం సర్కిల్

అనంతపురం క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. లోతట్టు కాలనీలకు వరద పోటెత్తింది. జనశక్తి నగర్, ఎంజీఎం కాలనీలలో అర్ధరాత్రి ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి నిద్రలేకుండా గడిపారు. ఆర్టీసీ బస్టాండు, రాజు రోడ్డు, శ్రీకంఠం సర్కిల్ తదితర ప్రాంతాలు మడుగులను తలపించాయి. సోమనాథ్ నగర్, రజక్ నగర్‌లో డ్రైనేజీ నీరు రోడ్డపైకి చేరింది. దీంతో కాలనీవాసులు డ్రైనేజీ కాలువలో చెత్తను తొలగించి, ముంపు ముప్పు లేకుండా చూసుకున్నారు. తెల్లవారేలోగా మరోమారు వర్షం రాకుంటే చాలు అని జనం భయపడే పరిస్థితి ఏర్పడింది. గతంలో భారీ వర్షాలతో కాలనీలకు కాలనీలు నీట మునిగాయి. దీంతో ప్రజలు కట్టుబట్టలతో మిగిలారు. ఆ పరిస్థితి మళ్లీ వస్తుందేమోనని పలువురు ఆందోళన చెందారు.





మడుగును తలపిస్తున్న ఆర్టీసీ బస్టాండు







ట్రూ అప్ చార్జీల వసూలు అక్రమం

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేంద్రకుమార్

అనంతపురంరూరల్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ఇంధన సర్దుబాటు పేరుతో అక్రమంగా ట్రూ అప్ చార్జీలు వసూలు చేయడం కూటమి ప్రభుత్వానికి తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేంద్రకుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం ఎదుట సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేంద్రకుమార్ మాట్లాడుతూ... విద్యుత్‌కు సంబంధించి రూ.8,114కోట్లు సర్దుబాటు చార్జీల పేరుతో జనం మీద భారాలను వేయడాన్ని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంద న్నారు. గత జగన్ ప్రభుత్వం ఇదే రకంగా సాగించడం వలన జనం ఆ ప్రభుత్వాన్ని గద్దెదించారని గుర్తు చేశారు. అలాగే జగన్ ప్రభుత్వం హిందుజా కంపెనీకి రూ.1234కోట్లు అక్రమంగా చెల్లించిందని, దాని మీద సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు బాలకృష్ణ, ప్రకాష్‌రెడ్డి, మసూద్‌వలి, వెంకటేష్, రాము, లక్ష్మీనారాయణ, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖజానాకు గండికొడితే కఠిన చర్యలు

● విజిలెన్స్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న విజిలెన్స్ ఎస్పీ ప్రసాద్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు18: ప్రభుత్వ ఖజానాకు గండికొట్టాలని చూస్తే సహించేది లేదని విజిలెన్స్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం విజిలెన్స్ కార్యాలయంలోని తమ చాంబర్‌లో కార్యాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. శాఖపరమైన పలు అంశాలపై చర్చించారు. అందులో భాగంగా విధినిర్వహణలో భాగంగా ఎప్పటి ఫైల్స్ అప్పుడు పూర్తి అయ్యేలా, సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. పన్నుల ఎగవేత, ఖనిజ సంపద, సహజ వనరులు, ఎరువులు. పురుగుల మందులు, పీడీఎస్ బియ్యం సరఫరా తదితర వాటిలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. వీటిపై సిబ్బంది ప్రత్యేక నిఘా ఉంచి ఎప్పటికప్పుడు ప్రజలపై భారం పడకుండా తమవంతు చర్యలు చేపటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంగించినట్లు తేలితే వదిలే ప్రసక్తి లేదన్నారు. రెగ్యులర్ తనిఖీలు చేపట్టి ఎక్కడా సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రభుత్వానికి చేరాల్సిన సొమ్ము చేరాలని సూచించారు. డీఎస్పీ నాగభూషణ, సూపరింటెండెంట్ శర్మ, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ ఫణింద్రనాథ్ రెడ్డి, ఏఓ వాసుప్రకాస్, డీసీటీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి మొబైల్ ఆధార్ వారోత్సవాలు

రాప్తాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 22 నుంచి 25 వరకూ పాలచెర్ల, బొమ్మేపర్తి, గొందిరెడ్డిపల్లి, మరూరు-3 సచివాలయాల్లో మొబైల్ ఆదార్ కేంద్రాల్లో వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. ఆదార్ అప్డేట్, ఆదార్ ఎన్‌రోల్‌మెంట్ ఇతర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంహెచ్‌ఓను సస్పెండ్ చేయాలి

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

● కార్మికుల సమస్యలపై ఆందోళన



మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

అనంతపురం క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కార్మికులకు అన్యాయం చేస్తున్న అవినీతి ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తిని వెంటనే సస్పెండ్ చేయాలని లేని పక్షంలో బదిలీ చేసి పంపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై శుక్రవారం మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏటీఎం నాగరాజు, నాగభూషణం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... పనిముట్ల విషయంలో అవినీతికి పాల్పడిన ఎంహెచ్‌ఓపై చర్యలు తీసుకోకపోతే సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికను ముట్టడిస్తామని హెచ్చరించారు. రెగ్యులర్, ఎన్ఎంఆర్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్మికులకు పనిముట్లు, రక్షణ పరికరాలు తదితరాలను సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. గోడౌన్‌లోని పాత పనిముట్లను బయటకు తీసి, రూ.5లక్షలు వెచ్చించి పనిముట్లు కొన్నామని చెబుతున్న అధికారులపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే దశలవారీ ఆందోళనలు చేపడుతామన్నారు. అనంతరం అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆదినారాయ, నారాయణ స్వామి, బండారు ఎర్రిస్వామి, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

'ర్యాపిడో, ఉబెర్‌ను రద్దుచేయాలి'

అనంతపురం కల్చరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల మధ్య చిచ్చు పెడుతున్న ర్యాపిడో, ఉబెర్ సంస్థలను వెంటనే రద్దు చే యాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పాత తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నాలో నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ... జిల్లాలో ఆటోలు తోలుకుంటూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల కడుపులు కొడుతూ ర్యాపిడో, ఉబెర్ సంస్థలు దోపిడీని ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఆటో డ్రైవర్లమధ్య చిచ్చుపెట్టి, వారి కుటుంబాలను వీధుల పాలు చేసేందుకు పూనుకున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ, ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాగరాజు, ప్రకాష్‌రెడ్డి, శ్రీనివాసులు, విశ్వ, మురళి, రామాంజనేయులు, ఆదినారాయ ణ, ఆజం బాషా, శివప్రసాద్, భవాని శ్రీనివాసులు, లలింగారెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

రాప్తాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న పీడీ రాజశేఖర్‌రెడ్డి పాఠశాలకు అహూజా మైక్ సెట్ అందజేశారు. రూ.20 వేలు విలువ చేసే మైక్ సెట్‌ను శుక్రవారం పాఠశాల హెచ్ఎం సాంబశివుడుకు అందించారు. 50 వాట్ల అహూజా రీజార్జబుల్ మైక్‌సెట్ పాఠశాలలో జరిగే కార్యక్రమాలకు ఎంతో ఉపయోగకరమని హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవమూర్తి, నల్లప్ప, సాయిప్రసాద్, గోపాల్‌రెడ్డి, కేశవయ్య, అంజనాదేవి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సాగు, తాగునీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి

● సీపీఎం నాయకులు ఓబులు, రాంభూపాల్ డిమాండ్



నార్పలలో మాట్లాడుతున్న సీపీఎం సీనియర్ నాయకుడు ఓబులు

నార్పల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సాగు, తాగు నీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, వాటి ఆధునీకరణ చేపట్టాలని సీపీఎం సీనియర్ నాయకులు ఓబులు, జిల్లా కార్యదర్శి రాంభూపాల్ విమర్శించారు. తుంగభద్ర ప్రాజెక్టులో నీరు పొంగిపొర్లుతున్న సుబ్బరాయసాగర్ నింపలేని దౌర్భాగ్యస్థితిలో పాలకులు, అధికారులు ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాలో సాగు, తాగునీటి సమస్యపై సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర శుక్రవారం మండలపరిధిలోని నడింౌడ్డి, కేసేపల్లి మీదుగా మండల కేంద్రమైన నార్పలకు చేరింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గాంధీ సర్కిల్‌లో బహిరంగ సభ నిర్వహించి మాట్లాడారు. రైతుల పక్షాన సీపీఎం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిస్తోందని, ఈనెల 21న కలెక్టరేట్ వద్ద మహాధర్నాకు రైతులు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ నల్లప్ప, బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, రైతు సంఘం రాజా, రామి రెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పుల్లన్న, నాగరాజు, మండల నాయకులు ప్రభాకర్, రామాంజినేయులు, నాగన్న, దేవమ్మ పాల్గొన్నారు.

శింగనమల : సీపీఎం బస్సు యాత్ర శుక్రవారం నియోజకవర్గం కేంద్రమై శింగనమలలోనూ సాగింది. అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో సీపీఎం సీనియర్ నాయకుడు ఓబుళు, జిల్లా కార్యదర్శి రాం భూపాల్ మాట్లాడుతూ తుంగభద్ర ప్రాజెక్టులో నీరు పొంగిపొర్లుతోందని, అయితే హెచ్ఎల్‌సీ నీటితో నియోజకవర్గంలోని చెరువులను నింపలేని దౌర్భాగ్య స్థితిలో పాలకులు ఉన్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు భాస్కర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర శుక్రవారం రాత్రి గార్లదిన్నె చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రాం భూపాల్ మాట్లాడుతూ... శ్రీశైలం, తుంగభద్ర డ్యాంలు నిండిన అనంత జిల్లాకు రాకపోవడం బాధాకరమన్నారు. నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తరిమెల నాగరాజు, చెన్నారెడ్డి, నల్లప్ప, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: సీపీఎం బస్సు యాత్ర శుక్రవారం మండల పరిధిలోని బొమ్మలాటపల్లి, వెంకటాపురం, రేకలకుంట, రెడ్డిపల్లి, రోటరీపురం, కొర్రపాడు గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, రాష్ట్ర నాయకులు ఓబులు, జిల్లా కమిటీ సభ్యులు ఓ నల్లప్ప హాజరై మాట్లాడారు. పీఏబీఆర్ కుడికాలువ, హెచ్చెల్సీ ద్వారా జిల్లాలోని చెరువులను నీటితో నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మం లో సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, బాల రంగయ్య, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, రాజా రామిరెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగ వారోత్సవాలు

అభివృద్ధి పనులకు భూమి పూజ



చిన్నంపల్లిలో పండ్లతోటల పెంపకానికి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురంరూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లిలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి హార్టీకల్చర్ అధికారులు శ్రీకారం చుట్టారు. గ్రామానికి చెందిన మారినేని లక్ష్మీదేవి పొలంలో శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓఆర్డీ వెంకటనాయుడు, సర్పంచు శివశంకర్, రైతులు త్రిలోక్, హార్టీకల్చర్ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని రుద్రంపేట, కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కక్కలపల్లి కాలనీలో ఆరు రోడ్లకు రూ.43లక్షలు నిధులు మంజూరైనట్లు ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. రుద్రంపేటలో మదర్‌తెరిస్సా కాలనీలో రూ.10లక్షలతో సీసీరోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లా, ఆయా పంచాయితీల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● గార్లదిన్నె: మండలంలోని కొప్పలకొండ, కమలాపురం, కేశవాపురం పం చాయతీల్లో శుక్రవారం రూ. 33 లక్షలతో సీసీరోడ్లకు భూమి పూజ చేశారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, సర్పంచులు రా మాంజినేయులు, అంజినమ్మ, పీఆర్ ఏఈ శ్రీనివాస్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మణ్, నాయకులు శీనప్ప, వెంకట్రాముడు, పుల్లన్న, ఆదినారాయణ, శ్రీరాములు, అంజి, రామాంజి, చౌడన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● రాప్తాడు: మండలంలోని బోగినేపల్లిలో శుక్రవారం పల్లె పండుగ కార్యక్ర మం నిర్వహించారు. సీసీ రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. సీసీ రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచిం చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉజ్జినప్ప, ఏపీఓ సావిత్రి, ఈసీ మురళి, టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు టీడీపీ నాయకులు శివయ్య, నారాయణ, నాగప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు: మండల పరిధిలోని తోపుదుర్తి గ్రామంలో శుక్రవారం రూ. 40లక్షలతో సీసీ రోడ్లకు, రూ. 17 లక్షలతో గోకులం షెడ్ల నిర్మాణానికి ఎంపీ డీఓ లక్ష్మీనరసింహస్వామి తదితరులు భూమి పూజ చేశారు. అలాగే రూ. 28లక్షలతో పది మంది రైతుల పండ్ల తోటల పెంపకాన్ని, రూ. 50లక్షలతో పీఏబీఆర్ కాలువ అభివృద్ధి పనులను, రూ. 75లక్షల ఇతర అభివృద్ధి పనుల ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఓ సుజాత, టెక్నికల్ అసిస్టెంటు నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్ నాయుడు, టీడీపీ నాయకులు జగన్‌మోహన్ చౌదరి, మండల ఆదినారాయణ, తలారి సురేష్, ఓబుళమూర్తి, నరసప్ప, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

● నార్పల: మండలంలోని బొందలవాడ గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం టీడీపీ జిల్లా నాయకుడు ఆలం వెంకట నరసానాయుడు సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగావతి, ఏపీఓ ఎర్రమ్మ, సంచాయతీ సెక్రెటరీశ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: మండలంలోని నాయనవారిపల్లిలో శుక్రవారం పల్లె పండు గలో భాగంగా సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, ఎంపీడీఓ నిర్మలాకూమారి, సర్పంచ్ రమణమ్మ, ఈసీ దామోదర్ టీడీపీ నాయకులు ఆదినారాయణ, గుర్రం లక్ష్మీనారాయణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు..

● కనగానపల్లి: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని గుంతపల్లి, బానుకోట గ్రామాల్లో సీసీరోడ్ల పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. ఎంపీడీఓ అనిల్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, నాయకులు ఆదినారాయణ, యాతం జయశంకర్, మల్లికార్జున, బొజ్జన్న, నాగభూషణం, రమేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు రానీయొద్దు

● ఎంపీడీఓ

రాప్తాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్త కుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం లో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మురుగు కాల్వలు సకాలంలో పరిశుభ్రం చేయాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనంద్‌కుమార్, హౌసింగ్ ఏఈ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు

కనగానపల్లి,అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమాదేవి పేర్కొన్నారు. నరసంపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. రీ సర్వేలో వచ్చిన భూసమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరించుకోవాలని ఆమె రైతులకు సూచించారు. అలాగే ఈ నెల 21న ముత్తవకుంట్ల, 23న కేఎన్‌పాళ్యం, 24న ఎలక్కుంట్ల గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌ప్రసాద్, సర్పంచ్ సోమరచంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

భూ రీసర్వే గ్రామసభలో 31అర్జీలు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాదిండి గ్రామంలో భూ సర్వేపైన సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో రైతుల నుంచి సమస్యలపై 31 అర్జీలు వచ్చినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. జాయింట్ ఎల్‌పీఎంకు సంబంధించి రైతుల నుంచి ఎక్కువగా అర్జీలు వచ్చాయన్నారు. అదేవిధంగా రీ సర్వేకు మునుపు విస్తీర్ణానికి, తరువాత వచ్చిన విస్తీర్ణంలో తేడాలు ఉన్నట్టు పలువురు రైతులు వినతులు అందజేసినట్టు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సంతోషలక్ష్మి, విలేజ్ సర్వేయర్ బాస్కర్, వీఆర్వో చంద్రశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పురాతన ఆలయ అభివృద్ధికి టీటీడీ సహకారం

శింగనమల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలోని పురాతన ఆత్మ సీతారాముల గుడి అభివృద్ధికి టీటీడీ సాకారం చేయడానికి సిద్ధంగా ఉందని టీటీడీ అధికారి మోహనయ్య పెర్కొన్నారు. ఆయన శుక్రవారం సాయంత్రం శింగనమల ఆత్మసీతారాముల గుడిని దర్శింకున్నారు. అనంతర గుడి అభివృద్ధిపై ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో మాట్లాడారు. గుడి అభివృద్ధిపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ టీటీడీ అధికారులను సంప్రదించారన్నారు. పురావస్తు, దేవాదాయశాఖల అనుమతులు తీసుకుని టీడీపీ అమోదం తెలిపిందని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు లక్ష్మణరావు గ్రామపెద్దలు బోయ సత్తి, నారాయణ, వెంకటేశ్, బండి వెంకటనారాయణ , గుర్రప్ప, గంపయ్య, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై దివ్యాంగులకు అవగాహన

రామగిరి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ప్రతిభా దివ్యాంగుల సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు చట్టాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగులతోపాటు మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభాసొసైటీ కో ఆర్డినేటర్ గణేశ్, డైరెక్టర్ బాబన్న, మిళితా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ పంపిణీ

శింగనమల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చదువులో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు మండలంలోని తరి మెల ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ స్కాలర్ షిప్పులు అందజేశారు. తరిమెల జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం 7,9,8 తరగతులలో ప్రతిభ చూపిన ముగ్గురు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు తరిమెల ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రగతి విద్యాజ్యోతి స్కాలర్ షిప్‌ను బ్యాంకు మేనేజర్ మురళి రూ.5000 చెప్పున విద్యార్థుల ఖాతాల్లో జమ చేశారు.

ద్విచక్రవాహనం దగ్ధం

● నిప్పుపెట్టిన గుర్తు తెలియని దుండగులు

కళ్యాణదుర్గం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసంపల్లిలో గంగాధర అనే వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనానికి గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టారు. దీంతో అది పూర్తిగా దగ్ధమైంది. గంగాధర్ ఎప్పటిలాగానే గురువారం రాత్రి తన ఇంటి ముందే బైక్‌ను పార్క్ చేశాడు. కాగా శుక్రవారం ఉదయం లేచి చూసేసరికి పూర్తిగా దగ్ధమై కనిపించింది. మధ్యరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు పెట్రోల్ పోసి నిప్పు పెట్టారని బాధితుడు వాపోయాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు తెలిపారు.

టిప్పర్లు ధ్వంసం

పామిడి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాతీయ రహదారి పక్కన నిలిచి ఉన్న రెండు టిప్పర్లను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసినట్లు బాధితుడు చిన్న నరసింహులు తెలిపాడు. స్థానిక ఎద్దులపల్లి రోడ్డులో నివాసముంటున్న చిన్న నరసింహులు టిప్పర్లు పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే శుక్రవారం వేకువజామున జాతీయ రహదారి పక్కన వాటిని నిలిపాడు. వాటి వెనుక ఇసుక ఉండడంతో.. ఆ ఇసుకను తరలిస్తున్నాడన్న నెపంతో గుర్తుతెలియని వ్యక్తులు టిప్పర్ల అద్దాలు, లైట్లు ధ్వంసం చేశారు. ఈ ఘటనతో తనకు సుమారు రూ. 3లక్షలు నష్టం వాటిల్లిందని బాధితు డు వాపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు.

ఎస్ఐల బాధ్యతల స్వీకరణ

గుంతకల్లు టౌన్/పెద్దవడుగూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండ లంలోని కసాపురం పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్ఐగా వెంకటస్వామి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ నరేంద్రకుమార్ బదిలీపై వెళ్లారు. అలాగే పెద్దవడుగూరు మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్ఐగా ఆంజనేయులు బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఎస్ఐ రెడ్డప్ప బదిలీ అయ్యారు.

సంగాలలో రెవెన్యూ గ్రామసభ

గుంతకల్లుటౌన్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగాల గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఇందులో ఆర్డీఓ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. భూమి రీసర్వే పూర్తయిన గ్రామాలలో ఈ సభలను నిర్వహిస్తున్నామన్నారు. భూ సమస్యలున్న రైతులు అర్జీలు ఇవ్వాలని సూచించారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం పలువురు రైతుల వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దారు రమాదేవి, రీసర్వే డీఈ, మండల సర్వేయర్,ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

సొరకాయలపేటలో..

పామిడి: మండలంలోని సొరకాయలపేట గ్రామ సచివాలయంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి మాట్లాడుతూ.. భూరీసర్వే వల్ల ఏర్పడిన సమస్యలపై రైతులు అన్ని ఆధారాలతో వినతిపత్రాలు అందజేయాలని సూచించారు. 19న అప్పాజీపేట, దేవరపల్లి, 21న జీ కొట్టాల, పొగరూరు, 22న రామగిరి, ఎద్దులపల్లి, 23న తంబళ్లపల్లి, రామరాజుపల్లి గ్రామాల్లో సభలు నిర్వహిస్తామని చెప్పారు. రీసర్వే డీటీలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్, ఉంతకల్లు గ్రామాల్లో..

బొమ్మనహాళ్: మండల కేంద్రంతోపాటు ఉంతకల్లు గ్రామంలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఇందులో తహసీల్దార్ మునివేలు గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వే వల్ల సమస్యలు ఎదుర్కొంటున్న రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. రీసర్వేలో భూమి తక్కువ వచ్చిందని చాలామంది రైతులు అధికారుల దృష్టికి తీసకొచ్చారు. ఉంతకల్లులో 25, బొమ్మనహాళ్‌లో 15 వినతులు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్వేయర్లు రవితేజ, సూర్యనారయణరెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, టీడీపీ నాయకలు పయ్యావుల్లా అనిల్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బొమ్మనహాళ్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాయదుర్గం సీఐ వెంకటరమణ, ఎస్ఐ నబీరసూల్ మండలంలోని రౌడీషీటర్లు, మట్కాబీటర్లకు కౌన్సెలింగ్ ఇ చ్చారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీ సుకుంటామని హెచ్చరించారు. నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించి నా, జూదరం ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిత్యం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. కనుక ప్రతిఒక్కరూ శాంతియుతంగా జీవించాలని సూచించారు.

సర్టిఫికెట్లు ఇవ్వడంలో జాప్యంపై నిరసన

తాడిపత్రి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సర్‌సీవీ రామన్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపుతోందని విద్యార్థులు, తల్లిదండ్రులు శుక్రవారం కళాశాల వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు సంఘీభావం తెలిపి విద్యార్థులకు న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. అనంతరం సాధారణ పరిశీలనలో భాగంగా ఆ కళాశాలకు వచ్చిన నాక్ బృందానికి అక్కడ జరుగుతున్న సమస్యలపై వారు వినతిపత్రం అందజేశారు.

59 మి.మీ. వర్షపాతం నమోదు

శెట్టూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. 59 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చిన్నపాటి వాగులు, వంకలు పొంగిపొర్లాయి.

వర్షానికి కూలిన ఇంటి పైకప్పు

పెద్దవడుగూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బీసీకాలనీలో సాంబశివుడు అనే రైతుకు చెందిన ఇంటి పైకప్పు శుక్రవారం మధ్యాహ్నం కూలిపోయింది. గత మూడురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నెమ్ము దిగడంతో ఇంటిపైకప్పు కూలిపోయింది. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అధికారులు ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గార్లదిన్నె, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి తండాకు చెందిన పల్లవిబాయి (25) గత ఐదురోజుల క్రితం శింగనమల మండలం నాగులగుడ్డం తండాలో బంధువుల ఇంటికి బంధువు శంకర్‌నాయక్‌తో కలిసి బైక్‌పై వెళ్లింది. అనంతరం స్వగ్రామానికి తిరిగివస్తుండగా పెనకచెర్ల డ్యాం వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రూ అప్ చార్జీల భారం తగ్గించాలి

గుంతకల్లు టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్ చార్జీల భారం తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆలూరు రోడ్డులో గల విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల దృష్టిని మరల్చేందుకు ట్రూఅప్ చార్జీలపై అప్పట్లో ప్రజాభిప్రాయాన్ని విద్యుత్ సంస్థలు తీసుకోలేదన్నారు. ఎన్నికల అనంతరం ప్రజలపై భారాలు వేసేందుకు సేకరిస్తున్న ప్రజాభిప్రాయాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు మారుతిప్రసాద్, కసాపురం రమేష్, సాకేనాగరాజు, నాయకులు సునీల్‌కుమార్, సురేంద్ర, చంద్ర, ఓబులేసు, తిమ్మప్ప, రామునాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఎన్నిక

రాయదుర్గం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారిగా ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకుడు నారాయణస్వామి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హనుమంతనాయుడు, కుళ్లాయస్వామి సమావేశం నిర్వహించి తనను ఎన్నుకున్నట్లు చెప్పారు.

తుఫాన్ దెబ్బకు రైతులు విలవిల

● మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు తడుస్తున్న ధాన్యం

● కాపాడుకోవడానికి నానా తంటాలు..

రాయదుర్గం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో గత నాలుగు రోజుల నుంచి వర్షం కురుస్తుండడం వల్ల ధాన్యం తడుస్తుండడంతో రైతులు విలవిల్లాడిపోతున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో వాటిని కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఆవులదట్ల, కదరంపల్లి, కొండాపురం, కెంచానపల్లి తదితర గ్రామాల్లో మొక్కజొన్న, వేరుశనగ పంటలు కోశారు. కాగా గత మూడురోజుల నుంచి వర్షం ఎడతెరిపి లేకుండా కురవడంతో ధాన్యం తడిసి రంగు మారుతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇలా అయితే కొనేందుకు వ్యాపారులు ఎవరూ ముందుకు రారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిగా తెరపి ఇస్తే పంటలను కల్లాల్లో,రోడ్లపై ఆరబెట్టుకుంటున్నామని, మళ్లీ అంతలోనే వర్షం పడి నాశనం చేస్తోందని అంటున్నారు. రూ. లక్షలు ఖర్చు చేసి మొక్కజొన్న, వేరుశనగ, తదితర పంటలు పండించామని, దిగుబడి చేతికి వచ్చి అమ్ముకునే సమయంలో వర్షం రావడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన చెందుతున్నారు. ఈ వర్షానికి పంటను అమ్ముకోలేని దుస్థితికి వచ్చామని రైతులు వెంకటేష్‌నాయక్, ఓబులేష్, తిమ్మరాజు, హనుమంతు, ధర్మానాయక్ తదితరులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నేలకొరిగిన టమోటా

కుందుర్పి: తుఫాను ప్రభావంతో మండలంలోని ప లు గ్రామాల్లో వివిధ పంటలు పూర్తిగా దెబ్బతినే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రైతులు అధికంగా టమాట సాగు చేశారు. అయితే గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి పందిరి సాగు చేసిన టమోటా పంటంతా కూలి నేలపాలైంది. పంట నేలకు ఒరగడంతో కాయలు మొత్తం దెబ్బతిని రైతు నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఆదుకుని సహాయం అందించే విధంగా చూడాలని పలువురు రైతులకు కోరుతున్నారు.

కుళ్లిపోయేస్థితిలో పలు పంటలు

బొమ్మనహాళ్: నాలుగు రోజులుగా కురుస్తున్న వ ర్షానికి మండలంలో మిరప, మొక్కజొన్న, పత్తి, జొన్న తది తర పంటలకు ప్రమాదం ఏర్పడింది. వర్షానికి పంటలు కుళ్లిపోయి రైతుకు తీవ్ర నష్టాన్ని మిగిల్చేలా ఉంది పరిస్థితి. దర్గాహోన్నూరు, బొల్లనగుడ్డం, గోవిందవాడ, కళ్లదేవ న హళ్లి తదితర గ్రామాలలో సాగైన జొన్న, మొక్కజొన్న, మిరప పొలాల్లో నీరు నిలిచి పంటలకు ప్రమాదం ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చెట్లు కుళ్లిపోతుండడంతో పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.



రాయదుర్గం మండలం ఆవులదట్లలో తడిసిన పప్పుశనగను రోడ్డుపై ఎండబెడుతున్నరైతులు



కుందుర్పి మండలం బసాపురం వద్ద నేలకొరిగిన టమోటా పంట



గోవిందవాడ వద్ద నీట మునిగిన మొక్కజొన్న పంట

మునగాకులో పోషకాలు అధికం

● అవగాహన సదస్సుల్లో ఐసీడీఎస్ సీడీపీఓలు

యాడికి/ రాయదుర్గం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మునగ ఆకులో ఎన్నో పోషక పదార్థాలు ఉంటాయని, దానిని తరచుగా ఆహార పదార్థాల్లో వినియోగించాలని ఐసీడీఎస్ తాడిపత్రి సీడీపీఓ సాజిదాబేగం సూచించారు. మునగాకు దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం మునగాకు వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీఓ పాల్గొని మాట్లాడుతూ.. మునగాకులో విటమిన్ ఏ, సీతో పాటు కాల్షియం, ఐరన్ సమృద్ధిగా లభిస్తాయన్నారు. ప్రొటీన్స్, మినరల్స్ కూడా పుష్కలంగా ఉంటాయన్నారు. వందజబ్బులను నివారించగల శక్తి మునగాకుకు ఉందన్నారు. కనుక ప్రతిఒక్కరూ తప్పక వాడాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్‌వాడీ వర్కర్ హేమావతి, పలువురు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం మండలం 74 ఉడేగోళం గ్రామంలో నిర్వహించిన అవగాహనా సదస్సులో రాయదుర్గం ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతమ్మ మునగాకు వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. నియోజకవర్గంలో 183 అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్లు ఘనంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రైతులకు సాగునీరు అందించాలి

● బస్సుయాత్రలో సీపీఎం నాయకులు



తాడిపత్రిలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

తాడిపత్రి, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులకు సాగునీటిని అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రాంభూపాల్, రాష్ట్ర నాయకుడు ఓబులు డిమాండ్ చేశారు. సాగునీటి కోసం వారు చేపట్టిన బస్సుయాత్ర శుక్రవారం తాడిపత్రికి చేరుకుంది. ఈ సందర్భంగా బస్టాండ్ సర్కిల్‌లో నిర్వహించిన బహిరంగ సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో సాగునీరు ఇవ్వమంటే కరువు పేరు చెబుతూ నీరు లేదనే సాకులు చెప్పేవారన్నారు. ప్రస్తుతం సమృద్ధిగా వర్షాలు పడుతున్నప్పటికీ డ్యాములు జలకళ సంతరించుకున్నప్పటికీ.. జిల్లాలో చెరువులను నింపడానికి పాలకులకు మనసు రావడం లేదన్నారు. అనంత రైతులను కాపాడాలంటే సాగునీరు అందించడమే మార్గమన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా పోలవరం మాత్రం పూర్తికావడం లేదన్నారు. డ్యాంల నుంచి వృథాగా పోతున్న నీటిని వినియోగిస్తే అనంత సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలరంగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, రాజారామిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, కుళ్లాయప్ప, నాగరాజు, చౌడయ్య, చంటి తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరాయసాగర్ పరిశీలన

పుట్లూరు: మండలంలోని సంజీవపురం వద్దనున్న సుబ్బరాయసాగర్‌ను సీపీఎం నేతలు రాంభూపాల్, ఓబులు పరిశీలించారు. అనంతరం కడవకల్లులో బస్సుయాత్ర నిర్వహించి మాట్లాడారు. సుబ్బరాయసాగర్‌ను హెచ్చెల్సీ నీటితో నింపి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాయలసీమలో చుక్కనీరు లేని జలాశయాలు దర్శనమిస్తున్నాయన్నారు. సుబ్బరాయసాగర్ కింద పంటలు సాగుచేసే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. కుడి కాలువ ద్వారా హెచ్చెల్సీ నీరు అందించి అరటిరైతులను ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విత్తన పప్పుశనగ పంపిణీ

గుంతకల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం ఉదయం సబ్సిడీపై విత్తన పప్పుశనగ పంపిణీని చేపట్టారు. టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి పాల్గొని రైతులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ పప్పుశనగ విత్తనం మార్కెట్‌లో దొరికే విత్తనం కంటే నాణ్యంగా ఉందని తెలిపారు. నల్లరేగడి నేలలున్న కసాపురం, జీ కొట్టాల గ్రామాల రైతులు విత్తన పప్పుశనగను తీసుకెళ్లారు. టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, గుమ్మనూరు వెంకటేశులు, జడ్పీటీసీ సభ్యుడు కదిరప్ప, ఏఓ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని ఎద్దులపల్లి గ్రామ సచివాలయం వద్ద రైతులకు ఏఓ లీనావసుంధర విత్తన పప్పుశనగ పంపిణీ చేశారు. టీడీపీ నాయకులతో కలిసి ఆమె రైతులకు పప్పుశనగ అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీటీసీ జయకుమార్, నాయకులుగోవిందరాజులు, శ్రీనివాసులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడి రైతు సేవాకేంద్రంలో రైతులకు సబ్సిడీ విత్తన పప్పుశనగను టీడీపీ నాయకులు అందజేశారు. నాయకులు దబ్బర లక్ష్మీనారాయణ, శంకరప్ప, ప్రభాకర్, ఏఓ తులసీ పాల్గొన్నారు.

వర్షానికి నేలకూలిన విద్యుత్ స్తంభాలు

బొమ్మనహాళ్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. ముఖ్యంగా మైలాపురం, కొళగానహళ్లి గ్రామ శివార్లలో ఐదు విద్యుత్‌స్తంభాలు, మూడు ట్రాన్స్‌ఫార్మర్లు విరిగిపడ్డాయి. దీంతో ఆ గ్రామాలకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కరెంటు తీగలు తెగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని స్థానికులు శుక్రవారం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం కావడం వల్ల వీటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. గాలి లేకపోయినా ఉత్తి వర్షానికే స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరగడం ఆశ్చర్యాన్ని కల్గిస్తోందని వారు పేర్కొన్నారు. అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరారు.



మైలాపురంలో విరిగిపడిన విద్యుత్‌స్తంభం

అర్జాస్ స్టీల్ ప్రగతి పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్

తాడిపత్రి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని అర్జాస్ స్టీల్ పరిశ్రమలో శు క్రవారం 2012 నుంచి పరిశ్రమ ప్రగతి అనే పుస్తక ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా కలెక్టర్ వినోద్‌కుమార్ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్టీల్ పరిశ్రమ ద్వారా దాదాపు 2వేల మంది ఉపాధి పొందుతున్నారన్నారు. పరోక్షంగా వేలాదిమందికి జీవనోపాధి లభిస్తోందని తెలిపారు. ఎన్నో ఎత్తుపల్లాలను ఎదుర్కొని సంస్థ అంచెలంచెలుగా ఎదుగుతోందన్నారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పరిశ్రమ ఎండీ శ్రీధర్‌కృష్ణమూర్తి, డైరెక్టర్ జయప్రకాష్‌దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై ఊరేగిన చింతలరాయుడు

తాడిపత్రి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతల వెంకటరమణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివా రు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలోని స్వామివారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి అశ్వవాహనంపై కొలువుదీర్చి మంగళ వాయిద్యాల నడు మ పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



అశ్వవాహనంపై దర్శనమిస్తున్న చింతలరాయుడు

ఓటు నమోదుపై అవగాహన

బొమ్మనహాళ్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం తహసీల్దార్ మునివేలు ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం వంటిదన్నారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు నమోదును జనవరి 1, 2025 నాటికి నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్యంలో యువత పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలి

గుత్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్న ఆర్ఎంపీపై జిల్లా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్‌ప్రసాద్ కోరారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక తురకపల్లిరోడ్డులో ఓ ఆర్ఎంపీ అనుమతి లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్నారన్నారు. నాలుగురోజుల క్రితం జిల్లా వైద్యాధికారులు దానిని సీజ్ చేశారన్నారు. ఆ క్లినిక్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడి పేరుతో ఆర్ఎంపీ నడుపుతున్నాడన్నారు. జిల్లా వైద్యాధికారులు అతడిపై కఠిన చర్యలు తీసుకుని, క్లినిక్‌ను శాశ్వతంగా మూసివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, కేవీపీఎస్ మండల కార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు గేట్స్ విద్యార్థి

గుత్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పట్టణంలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల ట్రిపుల్ ఈ చివరి సంవత్సరం విద్యార్థి విష్ణువర్ధన్ ఎంపికైనట్లు కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ తెలిపారు. అనంతపురం జేఎన్‌టీయూ యూనివర్శిటీ ఆధ్వర్యంలో కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన ఇంటర్ యూనివర్శిటీ ఫుట్‌బాల్ సెలక్షన్‌లో విష్ణువర్ధన్ ఎంపికయ్యాడన్నారు. ఇందుకుగాను శుక్రవారం ఆ విద్యార్థిని కరెస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్ శ్రీవాణి, ఎంపీ రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, పీడీ జోహెల్ అభినందించారు.



విష్ణువర్ధన్‌రెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధితుడు పాటిల్ హనుమంతరెడ్డికి అందజేశారు. పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరు గ్రామానికి చెందిన పాటిల్ హనుమంతరెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2,70,400 మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఉరవకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సూచించారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలో శుక్రవారం సీజనల్‌వ్యాధులపై వైద్యఆరోగ్య ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ర్యాలీ స్థానిక పీహెచ్‌సీ నుంచి పురవీధులగుండా సాగింది. మలేరియా సబ్‌యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, హెచ్‌ఎం వేణుగోపాల్, వైద్యులు పాల్గొన్నారు.

కథల పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



జ్యోత్స్న

గుంతకల్లుటౌన్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ తిమ్మాపురం గ్రామ ఉన్నతపాఠశాలలో పీ జ్యోత్స్న అనే తొమ్మిదో తరగతి విద్యార్థిని కథల పోటీల్లో ప్రతిభ కనబరించిందని హెచ్‌ఎం నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మాచిరాజు బాల సాహిత్యపీఠం ఆధ్వర్యంలో కథల పోటీలను నిర్వహించారని, ఇందులో వన రక్షణ అనే కథను గత సెప్టెంబరు 26న పోస్టల్ ద్వారా ఆ విద్యార్థిని పీఠానికి పంపిందని అన్నారు. ఈ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన 232 కథల్లో 28 కథలు వివిధ విభాగాల్లో ఉత్తమంగా నిలిచాయన్నారు. వాటిలో జ్యోత్స్న రాసిన కథ ఉత్తమంగా ఎంపికైందన్నారు. ఇందుకు గా ను నవంబరు3వ తేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో ఆ విద్యార్థిని నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందుకోనున్నట్లు చెప్పారు.

వాహనాల తనిఖీ

గుత్తి, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాయల్‌సర్కిల్,పత్తికొండ రోడ్డులో శుక్రవారం అనంతపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాల తనిఖీ చేశారు. రికార్డులు సరిగా లేని, ట్యాక్స్ లేకుండా తిరుగుతున్న వాహనాలను పట్టుకుని వాటి యజమానులకు జరిమానాలు విధించారు.

పోలీసుల అదుపులో మట్కా నిర్వాహకులు?

యల్లనూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని శుక్రవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తిమ్మంపల్లి, వాసాపురం గ్రామాలకు చెం దిన ఇద్దరి వద్ద నుంచి మట్కాపట్టీలతో పాటు నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. వారు మట్కాపట్టీలను కడప జిల్లా పులివెందుల ప్రాంతానికి పంపుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిసింది.

హాస్టళ్ల తనిఖీ

ఉరవకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాంఘిక సంక్షేమ, బీసీ హాస్టళ్లతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలల బాలుర, బాలికల హాస్టళ్లను శుక్రవారం ఉరవకొండ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి దుర్గాకల్యాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి మెనూ బోర్డులను పరిశీలించారు. తర్వాత విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్ల భవనాలు వర్షానికి కారుతున్నాయని విద్యార్థులు ఆమె దృష్టికి తెచ్చారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడిపత్రి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపో కార్యాలయంలో శనివారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ శంకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు 9959225856 కు ఫోన్ చేసి తమ విలువైన సలహాలు, సూచనలను ఇవ్వాలని ఆయన కోరారు.

సమస్యలు తీర్చలేని సమావేశాలు ఎందుకు?

● మండల సమావేశంలో అధికారులపై ప్రజాప్రతినిధుల మండిపాటు

పామిడి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సమస్యలు తీర్చలేని సమావేశాలు ఎందుకని అధికారులపై పలువురు ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ తేజోత్స్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో పలుశాఖల అధికారులు తమ శాఖా పరమైన సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. ఈ క్రమంలో పలు సమస్యలపై ప్రజాప్రతినిధులు అధికారులపై విరుచుకుపడ్డారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిరుపాల్‌నాయక్ మాట్లాడుతుండగా.. వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీ సభ్యుడు మజ్జిగ రాజశేఖర్ కలుగజేసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీలు లేకుండా సీసీ రోడ్లు ఎలా నిర్మిస్తారని నిలదీశారు. డ్రైనేజీలు లేక వర్షాకాలం వస్తే రోడ్లు చిత్తడి అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండలానికి వచ్చిన నిధులను కేవలం రెండు గ్రామాలకే కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. ప్రతి సర్వసభ్య సమావేశంలోనూ సమస్యలను తెలియజేయడమే ఉందని, వాటిని పరిష్కరించడం మాత్రం లేదని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించలేనప్పుడు సమావేశాలు ఎందుక ని అసహనం వ్యక్తం చేశారు. రీసర్వేతో రైతులకు తీరని సమస్య లు తలెత్తాయని రామరాజుపల్లి సర్పంచు డీసీ ముత్యాలరెడ్డి త హసీల్దార్ శ్రీధర్ మూర్తి దృష్టికి తీసుకెళ్లారు. ఇలా వివిధ సమస్యలపై పలువురు ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



పామిడిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని నిలదీస్తున్న వైస్ ఎంపీపీ మహేష్

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంపై సభ్యుల ఆగ్రహం

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. సభ మొదలవగానే విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ అధికారులు ఎవరూ గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండరని, దీంతో విద్యుత్ ప్రమాదాలు జరిగి ప్రజలు మృత్యువాత పడుతున్నారని వాపోయారు. స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు ఇకపై ఇలా జరగకుండా చూసుకుంటామని తెలిపారు. తర్వాత ఆయాశాఖల అధికారులు చేపట్టే అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఎంపీడీఓ బాబాసాబ్, ఏపీఓ పుల్లారెడ్డి, ఎంపీటీసీ మెంబరు చిన్నగోవిందు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

రాయదుర్గం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని కోరుతూ గార్మెంట్స్ కార్మికులు శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఏఈ బాలచందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్థానిక 1వవార్డు పార్వతీనగర్ సహా వివిధ కాలనీల్లో గురువారం రాత్రి నుంచి ఇప్పటివరకు విద్యుత్ సరఫరా లేదన్నారు. దీంతో తమకు పనులు జరగడం లేదని వాపోయారు. విద్యుత్ లేకపోతే పనులు ఏమాత్రం ముందుకెళ్లవని అన్నారు. పనుల్లేకపోతే జీవనం కష్టతరమవుతుందన్నారు. తరచూ ఈ సమస్య ఎదురవుతోందని తెలిపారు. ఇప్పటికైనా సమస్య లేకుండా చూడాలని కోరారు. స్పందించిన ఏఈ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురైందని, త్వరలోనే సమస్యకు పరిష్కారం చేస్తామని తెలిపారు.